APTEL/2008/28200

## బోల్తా పడిన ప్రైవేట్ బస్సు

హైదరాబాద్, జూన్ 24 : నగర ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు బస్సు చక్రాల కింద నలిగిపోయి దుర్మరణం చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న పలువురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముంబాయి వెళుతోంది. ఈ క్రమంలో నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో బోల్తా పడింది.పోలీసులు నార్సింగ్ ఓఆర్ఆర్ వద్దకు చేరుకుని పరిశీలించారు. ట్రావెల్స్ రోడ్డుకు అడ్డంగా ఉండటంతో 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయినట్లు సమచారం. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలిస్తున్నారు. పోలీసులు గాయపడిన ప్రయాణికులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తున్నారు.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## జూన్ 30 నుంచి డీఏవో పరీక్షలు

హైదరాబాద్, జూన్ 24 : తెలంగాణ రాష్ట్రంలో 53 డివిజనల్ ఎకౌంట్స్ అధికారుల (డీఏవో) పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష తేదీలు విడుదలయ్యాయి. జూన్ 30వ తేదీ నుంచి జులై 4 వరకు మల్టీసెషన్స్‌లో ఆన్‌లైన్ విధానంలో రాతపరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టీజీపీఎస్సీ ప్రకటన వెలువరించింది. మొత్తం 2 పేపర్లకు ఈ పరీక్ష జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు పేపర్ 1 పరీక్ష, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరుగుతుందని కమిషన్ ప్రకటనలో పేర్కొంది. జూన్ 25 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఈ సందర్భంగా కమిషన్ సూచించింది.స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్) పరీక్ష-2024కు సంబంధించిన నోటిఫికేషన్ ఈ రోజు విడుదల అవనుంది. ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో రాత పరీక్షలు ఉంటాయి. ఈ పరీక్ష ద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని గ్రూప్-బి, గ్రూప్-సి విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేయనున్నారు.


సంపుటి: 16 సంచిక : 51 కరీంనగర్ మంగళవారం, జూన్ 25, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు


## తెలుగులో ప్రమాణం చేసిన ఎంపీలు



న్యూఢిల్లీ, జూన్ 24 : తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్నికై పార్లమెంట్‌లో అడుగు పెట్టిన ఎంపీలు తెలుగులోనే ప్రచారం చేశారు. 18వ లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి కేంద్రమంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన ఐదుగురు కూడా ఇవాళ ఎంపీలుగా లోక్‌సభలో ప్రమాణం చేశారు. మొదట కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రమాణ చేశారు. అనంతరం రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మతో ప్రొటెం స్పీకర్ బర్తృహరి ప్రమాణం చేయించారు. వీళ్లంతా అచ్చ తెలుగులోనే ప్రమాణం చేశారు. మంత్రులుగా ఉన్న ఎంపీలే కాకుండా ఇతర ఎంపీలు కూడా కొందరు తెలుగులో ప్రమాణం చేశారు. శ్రీభరత్, అప్పలనాయుడు, పురందేశ్వరి, బాలశౌరి, కేశినేని చిన్ని, శ్రీకృష్ణ దేవరాయలు తెలుగులోప్రమాణం చేశారు. మిగతా వాళ్లంతా ఇంగ్లిష్, హిందీలో ప్రమాణం చేశారు. తొలిరోజు లోక్‌సభకు హాజరైన మంత్రి కిషన్ రెడ్డి, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు పంచెకట్టులో సభకు హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాల తొలి రోజు ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పార్లమెంట్‌కు సైకిల్‌పై చేరుకున్నారు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు.. లోక్‌సభలో తొలిసారి అడుగుపెట్టారు అప్పలనాయుడు. ఢిల్లీలో తన అతిథి గృహం నుంచి సైకిల్‌పై పార్లమెంట్‌కు చేరుకున్నారు. సైకిల్ గుర్తుపై ఎంపీగా గెలిచిన విజయనగరం ఎంపీ మొదటి రోజు పార్లమెంట్‌లో అడుగు పెడుతున్న వేళ ఇలా సైకిల్‌పై చేరుకున్నారు.

# ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు!

### మూడు కేటగిరిల్లో వ్యవసాయ భూముల విలువల సవరణ

### వాణిజ్య ప్రాంతాలు మిస్ కాకుండా ప్రత్యేక దృష్టి

### తక్కువ ఉన్న చోట భారీగా..

హైదరాబాద్, జూన్ 24 : రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరణ కసరత్తు కొలిక్కి వస్తోంది. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల కనీస విలువపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఓ అభిప్రాయానికి వచ్చింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలోని ప్రతి ఎకరా వ్యవసాయ భూమి కనీస విలువను రూ.4 లక్షలుగా నిర్ధారించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. వాస్తవానికి ఈ విలువను రూ.4-5 లక్షలుగా నిర్ణయించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మౌఖికంగా సూచించింది. అయితే ఏజెన్సీ ఏరియాల్లో ఈ విలువలు సరిపోయే అవకాశం లేనందున భద్రాచలం, ములుగు, ఆసిఫాబాద్ లాంటి ఏజెన్సీ ప్రాంతాలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూమి కనీస రిజిస్ట్రేషన్ విలువను రూ.4 లక్షలు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అదే విధంగా నివాస స్థలాల కనీస విలువ ప్రతి చదరపు గజానికి రూ.1,000, అపార్ట్‌మెంట్ల కంపోజిట్ విలువ (చదరపు అడుగు) రూ.1,500గా ప్రతిపాదించాలని నిర్ణయించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చదరపు గజం కనీస విలువ రూ.500గా ప్రతిపాదించనున్నారు. ఈ మేరకు జరుగుతున్న కసరత్తు 90 శాతం పూర్తయిందని, సోమవారం సాయంత్రానికి రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సమర్పించనున్నాయని తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రతిపాదనలపై ఈ నెల 25వ తేదీన ఆ శాఖ ఐజీ సమీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే ఆర్‌సీసీ నిర్మాణాలు, రేకుల షెడ్లకు సంబంధించిన కనీస విలువల నిర్ధారణకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా వెలువడాల్సి ఉందని, ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువను సవరించే ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల విలువలను మూడు కేటగిరీలుగా నిర్ధారించనున్నారు. గ్రామాల్లోని వ్యవసాయ



భూములు (ఎక్కువ సర్వే నంబర్లలో ఇదే విలువ ఉంటుంది), రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన ఉండే వ్యవసాయ భూములు, వ్యవసాయేతర అవసరాలకు (వెంచర్లకు) వినియోగించేందుకు సిద్ధంగా ఉన్న భూములు..ఇలా మూడు కేటగిరీల్లో విలువలను నిర్ణయించనున్నారు. హైవేల పక్కన వ్యవసాయ భూముల విలువను రూ.40-50 లక్షల వరకు సవరించే అవకాశముందని, వ్యవసాయేతర అవసరాలకు సిద్ధంగా ఉన్న (ప్లాట్లుగా చేసేందుకు) భూమి విలువను రూ.కోటి వరకు సవరిస్తారని తెలుస్తోంది. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమీపంలో ఉన్న భూములకు, హైవేల పక్కనే ఉన్న నివాస ప్రాంతాలకు దూరంగా ఉండే భూములకు విలువల్లో తేడా ఉంటుందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ డివిజన్ సర్వే నంబర్లు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, హెచ్ఎండీఏ, ఇతర నగర అభివృద్ధి సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ప్రాతిపదికన వ్యవసాయ భూములు, ఆస్తుల సవరణ ప్రక్రియ సాగుతోందని అంటున్నారు. తాజాగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రక్రియలో భాగంగా వాణిజ్య ప్రాంతాలపై రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. గతంలో సవరణ జరిగినప్పుడు అప్పటివరకు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టుగా నిర్ధారణ అయిన డోర్ నంబర్ల విలువలను మాత్రమే వాణిజ్య కేటగిరీలో పరిగణనలోకి తీసుకున్నారు. కానీ ఇప్పుడు వాణిజ్య డోర్ నంబర్లను ముందే ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు.

## నీట్ అక్రమాలు తీసే పనిలో అధికారులు




న్యూఢిల్లీ, జూన్ 24 : నీట్ (యూజీ) పరీక్షలో గ్రేస్ మార్కులు కలిపిన 1563 మందికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) ఆదివారం (జూన్ 23) రీ ఎగ్జామ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా మొత్తం 7 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. అయితే పరీక్షకు భారీ సంఖ్యలో విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 1563 మందికి గానూ కేవలం 813 మంది మాత్రమే హాజరవడం చర్చణీయాంశంగా మారింది. 750 మంది పరీక్షకు హాజరు కాలేదు. చండీఘర్‌లో ఇద్దరు అభ్యర్థుల పరీక్ష రాసేందుకు అర్హత సాధించగా, వీరిద్దరూ పరీక్షకు హాజరుకాకపోవటం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లో 602 మంది పరీక్ష రాసేందుకు అర్హత సాధించగా.. వారిలో 291 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. అంటే 311 మంది గైర్హాజరయ్యారు. హర్యానాలో 494 మంది అభ్యర్థులలో 287 (58 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. 207 మంది డుమ్మా కొట్టారు. మేఘాలయలో 464 మందికి పరీక్ష రాసేందుకు అర్హత ఉండగా.. వీరిలో 230 మంది గైర్హాజరయ్యారు. 234 మంది అంటే 50.43 శాతం మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. గుజరాత్‌లో ఒకేఒక అభ్యర్థి పరీక్షకు అర్హత సాధించగా.. ఆ విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. ఈ ఏడాది మే 5వ తేదీన నిర్వహించిన నీట్ యూజీ పరీక్షలో ప్రశ్నాపత్రం ఆలస్యంగా అందించడంతో వారందరికీ ఎన్‌టీఏ గ్రేస్ మార్కులను ఇచ్చింది. దీనిపై చెలరేగిన వివాదం సుప్రీంకోర్టుకు చేరడంతో మొత్తం 1563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోర్టు ఆదేశించింది.

# పార్టీ మారుతున్న వారిపై బీఆర్ఎస్ న్యాయపోరాటం




హైదరాబాద్, జూన్ 24 : పార్టీ మారుపోతున్న ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ ఆపలేకపోతోంది. బుజ్జగింపుల ద్వారా సాధ్యం కావడం లేదు కాబట్టి .. వారిలో అనర్హతా వేటు భయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ మారిన వారందరిపై అనర్హతా వేటు వేయించేందుకు సుప్రీంకోర్టుకైనా వెళ్లేందుకు వెనుకాడేది లేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ సీఎం కేసీఆర్, కేటీఆర్ లకు అత్యంత సన్నిహితులైన వారు పార్టీ వీడిపోతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివసారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం బీఆర్ఎస్ అగ్రనేతలకు ఊహించని షాక్ లాంటిది. వారిని అత్యంత నమ్మకస్తులుగా కేసీఆర్ భావిస్తారు. జగిత్యాల సంజయ్ కుమార్ గెలుపును కల్వకుంట్ల కవిత రెండు సార్లు తన సొంత గెలుపుగా భావించి పని చేశారు. ఆయన కూడా పార్టీ మారిపోవడంతో ఇక రాజకీయాల్లో విశ్వసనీయతకు అర్థం లేదని అనుకుంటున్నారు. అంతకు ముందే కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు వంటి వారు కాంగ్రెస్ లో చేరిపోయారు. వారందిరపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తున్నారు బీఆర్ఎస్ అగ్రనేతలు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లో అనర్హత పిటిషన్ పైన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ వాదిస్తోంది. దానం నాగేందర్ పార్టీ మారినప్పుడు ఆయనపై స్పీకర్ కార్యాలయంలో పార్టీ ఫిరాయింపు పిర్యాదు ఇచ్చారు. తర్వాత హైకోర్టులోనూ పిటిషన్లు వేశారు. వాటిపై విచారణ జరగాల్సి ఉంది. మరో వైపు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు వరుసగా పార్టీ మారిపోతున్నారు. కేసీఆర్ కుటుంబానికి అత్యంత నమ్మకస్తులైన వారిపై వచ్చే ఒత్తిళ్లు తీవ్రంగా ఉంటాయి కాబట్టి.. మూడో కంటికి తెలియకుండా కండువా కప్పేస్తున్నారు. మిగిలిన ఎమ్మెల్యేలు అందర్నీ ఢిల్లీకి పిలిపించి కండవాలు కప్పుతారని.. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేస్తారని అంటున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా అనర్హతా వేటు అస్త్రాన్ని బీఆర్ఎస్ ప్రయోగిస్తోంది. అయితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం స్పీకర్ దే తుది నిర్ణయం. స్పీకర్ ఫలానా నిర్ణయం తీసుకోవాలని.. లేదా ఫలానా తేదీలోపు నిర్ణయం తీసుకోలేవని నిపుణులు చెబుతున్నారు. మహారాష్ట్ర విషయంలో అక్కడ పార్టీల్లో చీలిక వచ్చిందని ఈ కారణంగా ఏ పార్టీ వారు ఏ పార్టీలో చేరారన్నది స్పీకర్ తేల్చలేకపోవడం వల్ల మూడు నెలల గడువు పెట్టారని అంటున్నారు. మామూలుగా అయితే అధికార పార్టీల్లో చేరే ఎమ్మెల్యేలపై అనర్హతకు సంబంధించి స్పీకర్లు నిర్ణయాలు తీసకోవడం లేదు. అధికార పార్టీ వ్యూహంలోనే భాగంగానే వారు పార్టీలో చేరుతున్నారు. అయితే న్యాయపోరాటం చేసి అయినా సరే వాళ్లను మాజీలను చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

## హజ్ యాత్రలో 98కి చేరిన మృతులు



న్యూఢిల్లీ, జూన్ 24 : సౌదీ అరేబియాలో ఈ ఏడాది ఎండలు దంచికొడుతున్నాయి.. 50డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.. తీవ్రమైన వేడి.. ఉక్కపోతలో మాడిమసైపోతున్నారు.. ఈ తీవ్రమైన ఎండల్లోనే హజ్ యాత్ర కొనసాగింది.. ఎండ వేడిమికి హజ్ యాత్రకు వెళ్లిన 1300 మందికి పైగా యాత్రికులు మరణించారు. వారిలో 83 శాతం మంది చట్టవిరుద్ధంగా మక్కాకు వచ్చినవారేనని అధికారులు చెబుతున్నారు. చనిపోయిన వారిలో 98 మంది భారతీయులు కూడా ఉన్నారు. ఈ ఏడాది హజ్ యాత్రకు దాదాపు 22 దేశాల నుంచి పది లక్షల మంది యాత్రికులు రాగా.. సౌదీ అరేబియా పౌరులు 2 లక్షల మందికిపైగా హాజరయ్యారు. ఈజిప్టు నుంచి మరో 10 లక్షలకుపైగా ముస్లింలు తరలివచ్చారు. అయితే ఎండలు, వేడి గాలుల వల్ల యాత్రికులు ఉక్కపోతతో ఊపిరాడక చనిపోయారు. మరణాలు సంభవించిన రోజున రికార్డు స్థాయిలో 53 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.మొత్తం 1301 మంది మరణించగా.. వారిలో 660 మందికి పైగా ఈజిప్టు వాసులు ఉన్నారు. 31 మంది మినహా మిగతావారంతా అక్రమంగా హజ్ యాత్రకు వెళ్లినవారే..అయితే చట్టవిరుద్ధంగా హజ్ యాత్రకు వచ్చిన అనేక మందిని సౌదీ అధికారులు వెనక్కి పంపారు. కొంత మంది ఎలాగోలా మక్కా సహా సమీప ప్రాంతాల్లోని పవిత్ర స్థలాలకు చేరుకున్నారు. అయితే.. వారు ఉండడానికి హోటళ్లు, గూడారులు సహా ఎలాంటి వసతులు లేవు. దీంతో ఎండతాపం నుంచి కాపాడుకునేందుకు వారికి మార్గమే లేకుండా పోయింది. దీనివల్లే మరణాలు ఎక్కువైనట్లు అధికారులు చెబుతున్నారు.హజ్ యాత్ర చరిత్రలో మరణాలు కొత్తేమీ కాదు. ఐదు రోజుల హజ్ యాత్ర కోసం ప్రతి ఏడాది ఏటా దాదాపు 20 లక్షల మంది వరకు సౌదీకి వెళ్తారు. 1990లో హజ్‌యాత్ర సందర్భంగా 1426 మంది చనిపోయారు. 2015 లో మినాలో తొక్కిసలాట జరిగి 2400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈసారి హీట్‌వేవ్‌తో అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయారు.

## మళ్లీ చరిత్ర పునరావృతమౌతుంది..

హైదరాబాద్, జూన్ 24 : హస్తం పార్టీలో మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్ మొదలైంది.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి.. మొదట్లో ముగ్గురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరగా.. ఇటీవల మాజీ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు.. అయితే.. కేసీఆర్ కుటుంబానికి సాన్నిహిత్యంగా ఉండే వారే పార్టీను వీడుతుండటం.. ప్రస్తుత ఫిరాయింపు రాజకీయ పరిస్థితులపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చరిత్ర పునరావృతం అవుతుంది? అంటూ కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్న పార్టీ ఫిరాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. అధికారంలో ఉన్నామని వీర్రవీగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని కాంగ్రెస్ కు హెచ్చరించారు.ప్రజాస్వామ్యంలో ప్రజల శక్తి ఎప్పుడు అధికారంలో ఉన్నవారి కన్నా కూడా బలంగా ఉంటుందని కేటీఆర్ అన్నారు.. 2004-06 సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సార్లు పార్టీ ఫిరాయింపులకు పాల్పడింది. అప్పుడు కూడా బీఆర్ఎస్ ఇబ్బందులను ఎదుర్కొంది. ఇలాంటి కష్టసమయాలు బీఆర్ఎస్ కు కొత్త కాదు. కానీ కాంగ్రెస్ పార్టీ నీతి లేని వ్యవహారాలపై తెలంగాణ ప్రజలు ఆందోళనను ఉధృతం చేశారు. ఈ దెబ్బకు కాంగ్రెస్ పార్టీ తల వంచక తప్పలేదన్నారు. ప్రస్తుతానికి తమ పార్టీ ఎమ్మెల్యేల ను ఫిరాయింపులకు పాల్పడేందుకు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి మళ్లీ కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారు. చరిత్ర పునరావృతం అవుతుంది.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది మీరు కాదా..?

బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పందించారు. పార్టీలో చేరికల మీద బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మట్లాడుతున్నారు.. భట్టి.. ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది మీరు కాదా..? అంటూ ప్రశ్నించారు. శాసనమండలిలో నా ప్రతిపక్ష నేత హోదా మీరు తొలగించలేదా..? అంటూ ప్రశ్నించారు. తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను చేర్చుకుంది మీరు కాదా..? అంటూ పేర్కొన్నారు. బీఆర్ఎస్ కు పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లలో డిపాజిట్ పోయిందని ..ఇప్పుడు అనర్హత వేటు గురించి మట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ ఫైర్ అయ్యారు.కాగా.. పార్టీ ఫిరాయింపులతో తెలంగాణ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి..

# తెలంగాణ నుండి ఫోకస్

తెలుగు దినపత్రిక

మంగళవారం, జూన్ 25, 2024


## విచిత్ర, విపరీత ప్రకృతి వైపరీత్యానికి కారణమేంటి

ఓ ప్రాంతంలో భరించలేని ఎండలు. మరో ప్రాంతంలో తట్టుకోలేనంత చలి. ఇంకో ప్రాంతంలో ముంచెస్తున్న వరదలు. ఒక్కో దేశంలో ఒక్కో రకమైన పరిస్థితి. మొత్తానికి ప్రకృతి మనుషులతో ఓ ఆట ఆడుకుంటోంది. ఆట కూడా అనకూడదేమో.. తాండవం.. విలయతాండవం ఆడుతుంది. ఇంతకీ ప్రపంచవ్యాప్తంగా ఏం జరుగుతోంది ? ఈ విచిత్ర, విపరీత ప్రకృతి వైపరీత్యానికి కారణమేంటి ?ఈ దేశం ఆ దేశం అని లేదు. ప్రపంచంలో ఉన్న అన్ని ఖండాలు, దేశాల్లో ఇప్పుడు విచిత్ర వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. తీవ్ర ఎండ, వేడి గాలులు ఈ ఏడాది హజ్ యాత్రకు బయల్దేరినవారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. వడదెబ్బతో యాత్రీకులు పిట్టల్లా రాలుతున్నారు. ఇప్పటికే 1000 మంది మృత్యువాతపడ్డారు. ఇందులో భారతీయులు 98 మంది ఉన్నారు. ఈమేరు విదేశాంగ శాఖ అధికారికంగా వెల్లడించిందిఈ ఏడాది భారత్‌నుంచి 1.75 లక్షల మంది హజ్ యాత్రకు వెళ్లారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అక్కడ భారతీయుల కోసం కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉంటే ఏటా హజ్ యాత్రకు వెళ్లి 5 లక్షల మంది మరణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. వాస్తవ సంఖ్య ఇందుకు 30 రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు 10 దేశాలకు చెందిన 1,081 మంది మరణించినట్లు అక్కడి వైద్యాధికారులు ధ్రువీకరించారు. అత్యధికంగా ఈజిప్టుకు చెందిన యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.ఈ ఏడాది సౌదీలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత వారంలో 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు ఈ ఏడాది 18.3 లక్షల మంది హజ్ యాత్ర పూర్తి చేసుకున్నారు. ఇందులో 22 దేశాలకు చెందిన యాత్రీకులు 16 లక్షల మంది ఉన్నారు. ఇక సౌదీవాసులు 2 లక్షల మంది ఉంటారని అంచనా ఇప్పుడు అనేక దేశాల్లో టెంపరేచర్స్ అంతకంతకు పెరిగిపోతున్నాయి.మన దేశాన్నే తీసుకోండి. మాములుగా ఉత్తర భారతంలో వాతావరణం ఎప్పుడూ చల్లగా ఉంటుంది. ఇక ఈ టైమ్‌కు అయితే ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా నమోదవుతాయి. బట్ ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంది? మెయిన్‌గా ఢిల్లీ, యూపీ, హర్యానాలో వేడి గాలులు వీస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో అయితే నార్మల్ కంటే ఏకంగా ఆరు డిగ్రీ సెంటిగ్రెడ్‌లు ఎక్కువ టెంపరేచర్ నమోదవుతుంది. ఒక్క బిహార్‌లోనే 24 గంటల్లో 22 మంది చనిపోయారు. రెడ్ అలర్ట్‌లు జారీ అవుతున్నాయి. అడపాదడపా వర్షాలు కురిసినా ఉక్కపోత, ఎండలు మాత్రం తగ్గడం లేదు. హిల్ టౌన్స్ అయిన పౌరీ, నైనిటీల్‌లో కూడా వేడి గాలులు వీస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మూడు నెలలుగా ఇక్కడ చుక్క వర్షం పడలేదు.ఇది ఇండియా బాధ. ఈస్ట్ దేశాలలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 50 డిగ్రీల టెంపరేచర్ నమోదవడం కామన్‌గా మారింది. ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే జడుసుకునే పరిస్థితి ఉంది. దీనికి బెస్ట్ ఉదాహరణే హజ్ యాత్ర. గతంలో ఎప్పుడూ లేనంతగా మక్కాకు వచ్చే ముస్లిం భక్తులు చనిపోతున్నారు.ఇక మరో విచిత్ర పరిస్థితి ఏంటంటే.. ఎక్కడైతే ఇంత భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయో.. అదే మిడిల్ ఈస్ట్ కంట్రీలో ఉన్నట్టుండి అత్యంత భారీ వర్షం కురవడం, వరదలు రావడం జరుగుతోంది. ఎడారి దేశాల్లో వరదలు రావడం అనేది చాలా అరుదు. కానీ ఇప్పుడు చాలా కామన్‌గా మారిపోయింది. ఆ వరదలకు జనాలు చనిపోవడం కూడా అంతే కామన్‌గా మారిపోయింది.కొన్ని దేశాలు ఇలా ఎండలు, వానలతో కిందా, మీదా పడుతుంటే.. మంగోలియా పరిస్థితి మరోలా ఉంది. ఇక్కడ చలిని తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు అక్కడి ప్రజలు. ఇక చలి దెబ్బకు చనిపోతున్న జంతువుల సంఖ్యకైతే అసలు లెక్కేలేదు. ఇక్కడ జడ్.. అంటే తీవ్ర అనావృష్టి తరువాత వాతావరణం ఉన్నట్టుండి అతి శీతల చలికాలం రావడం. ఇప్పుడీ జడ్ మంగోలియాను షేక్ చేస్తుంది. ఇప్పుడీ జడ్ కారణంగా అక్కడ పచ్చగడ్డి కూడా మొలవడం లేదు. ఈ ఇయర్‌లో జడ్ కారణంగా 71 లక్షల పశువులు మృతి చెందాయి. ఇందులో పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. జడ్ కారణంగా కోటి 49 లక్షల పశువులు చనిపోతాయని అంచనాలు ఉన్నాయి. నిజానికి మంగోలియాలో పశువులు, యాక్‌లు, గొర్రెలు, మేకలు, గుర్రాలను జాతీయ సంపదగా ఆ దేశ రాజ్యాంగం గుర్తించింది. మంగోలియా ఎక్స్‌పోర్ట్స్‌లో మాంసానిది సెకండ్ ప్లేస్. ఇప్పుడు జెడ్ కారణంగా మంగోలియా ఎక్స్‌పోర్ట్స్‌కు దెబ్బ పడినట్టే. నిజానికి జెడ్ పదేళ్లకు ఒకసారి వచ్చేది ఈ జడ్. కానీ గడచిన పదేళ్లలో ఇప్పుడు వచ్చిన జడ్.. ఆరోది. అంటే ప్రకృతిలో ఎంత మార్పు వస్తుందో అర్థం చేసుకోవచ్చు.ముందే చెప్పుకున్నాం కదా.. ఓ చోట ఎండ.. మరో చోట వరద.. మరో చోట చలి. ఇలా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్క దేశం ఏదో రకమైన ప్రకృతి వైపరిత్యంతో ఇబ్బందులు పడుతూనే ఉంది. మరి దీనికి రీజన్ ఏంటో తెలుసా ? రోజురోజుకు పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్. రోజురోజుకు గ్రీన్ హౌస్ గ్యాస్ రిలీజ్ పెరుగుతుందే తప్ప.. తగ్గడం లేదు. ఇవన్నీ భూగోళాన్ని వేడెక్కిస్తున్నాయి. నిజానికి ప్రతి ఏడాది గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. ఆసియా నుంచి అంటార్కిటికా దాకా.. అత్యంత పేద దేశం నుంచి ధనిక దేశం దాకా.. ఇలా అన్ని వర్గాల్లో దీనిపై చర్చ నడుస్తుంది. అనేక నిర్ణయాలు తీసుకుంటారు. కానీ అమలు విషయానికి వస్తే అంతంత మాత్రమే. కర్బన ఉద్గారాలు పెరుగుతూనే ఉంటాయి.

## ఎన్నాళ్లు నిరీక్షణ !
# పేదల సొంతింటి కల నెరవేరేదెన్నడో.?



మహబూబాబాద్ టౌన్, జూన్ 24 : ఇళ్లులేని నిరుపేదలు తమ సొంతింటి కల సాకారం కోసం నిరీక్షిస్తున్నారు. ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయపార్టీలు అరచేతిలో స్వర్గం చూపుతూ.. గృహాలు మంజూరు చేస్తామని హామీలిస్తూ.. అధికారంలోకి వచ్చాక ముఖం చాటేస్తున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. తమకు అంతామేలు జరుగుతుం దని భావిస్తున్న ప్రజలకు నిరాశే మిగులుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో పాలనవల్ల నష్టం జరిగిందని యావత్ ప్రజానీ కం కొట్లాడి తెలంగాణ సాధించుకుంటే సొంత రాష్ట్రంలో కూడా అదేతంతు కొనసాగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో బీఆర్ఎస్ సర్కార్ అధికారంలోకి రాగానే ఇళ్లు లేని నిరుపే దలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వారి కలను సాకరం చే స్తామని పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వ స్థలంలో ఒకే చోట డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి, ఏ ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర వ్యాప్తంగా 2016లో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మహబూబాబాద్ జిల్లాలో పూర్తిస్థాయి డోర్నకల్, మా నుకోట, రెండేసి మండలాల ప్రాతినిధ్య పాలకుర్తి, ములు గు, ఇల్లందు నియోజకవర్గాల్లోని 18 మండలాల్లో 5,567 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేశారు. అందులో 2,503 పూర్తి కాగా, అసలు ప్రారంభించనివి 1,101, పునా ది స్థాయిలో 379, స్లాబ్ పూర్తయినవి 414, వివిధ దశల్లో 1170 ఇళ్లు ఉన్నాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చె ల్లించక పోవడం, కేటాయించిన నిధులు సరిపడక నిర్మా ణాలు చేయలేమని చేతులెత్తయడంతో అక్కడక్కడ పను లు నిలిచిపోయాయి. దీంతో కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో నిలిచిపోయాయి. 2503 ఇళ్లు పూర్తి కాగా 2155 మంది లబ్ధిదారులను ఎంపిక చే యగా అందులో 1403 మందికి ఇళ్లను కేటాయించారు. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినప్పటికి అరులైన నిరుపే దలకు కేటాయించకపోవడంతో అవి శిధిలావస్థకు చేరు కుంటున్నాయి. అంతే కాకుండా అ సాంఘీక కార్యకలపా లకు అడ్డాగా మారుతున్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన చోట లబ్ధిదారుల కిచ్చారు. కానీ అందులో వసతులు మరి చా రు. వసతుల లేమితో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 360 ఇళ్లు మంజూరు కాగా, అందులో మొదటి దశలో ప్రారం భించిన 200 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిరుపేదలకు కేటాయించినప్పటికి అందులో వసతు లు లేకవారు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్లు లేక వర్షం వస్తే బురదమయంగా మారడంతో అందులో నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సిన ?ధైన్యస్థితి. మిషన్ భగీ రథ ద్వారా వచ్చేనీరు సరిపోక పోవడంతో వేసవి కాలం లో వారి కష్టాలు అంతా ఇంతా కాదు! మినరల్ వాటర్ కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. ఇక వీధిదీపా లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి అయిం దంటే ఆ ప్రాంతం అంధకారంగా మారిపోతోం ది. వర్షాలు, గాలి దుమారం వచ్చిన సమ యంలో ఇళ్లలో సైతం కరెంటు పోతే భయంతో వణికిపోతున్నారు. వారికి సమీపంలోనే వైకుం ఠధామం ఉండడంతో భయ కంపితులవు తున్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల చుట్టూ కనీసం ప్రహారీగోడ కూడ లేకపోవడంతో పందులు, కుక్కలు లోనికి వస్తున్నాయి. ఇళ్లు లేని నిరుపేదలంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల కాలం లో జిల్లా వ్యాప్తంగా 1,403 మంది ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు కేటాయించడంతో ఇళ్లు లేని నిరుపేదలు సొంతింటి కల నెరవేరలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేర్చింది. తాము అధికారంలోకి వస్తే సొంత స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ. 5లక్షలు ఇస్తామని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్నిరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.

## అక్రమాల గూడెం మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 24 : మోదీ వస్తే ఈడీ వస్తుంది.. ఎన్నికల సమయంలోనే ఈడీ దాడులు చేస్తుంది.. విపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తుంది.. ఇదీ ఆరునెలల క్రితం వరకు బీఆర్ఎస్ నేతలు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐపై, కేంద్రంపై చేసిన ఆరోపణలు. కానీ ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యాయి. మోదీ రాష్ట్రానికి రాలేదు.. కానీ ఈడీ వచ్చింది. కారణం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి మైనింగ్ పేరుతో చేసిన అక్రమాల గుట్టు తేల్చబోతోంది. అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వానికి రూ.39 కోట్ల నష్టం నష్టం కలిగించారు. ఈ లెక్క తేల్చేందుకు ఈడీ మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు బంధువుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసింది. ఇక మొదట రూ.39 కోట్ల అక్రమాలు జరిగాయని ఈడీ భావించగా, దాడుల తర్వాత ఈడీకి దిమ్మ తిరిగి బొమ్మ కనిపించింది. పత్రాలు, కంప్యూటర్లు, రికార్డులు పరిశీలించిన తర్వాత రూ.300 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు ఈడీ అధికారులు అధికారికంగా వెల్లడించారు. సంతోష్ సాండ్, సంతోష్ గ్రానైట్ కంపెనీల ద్వారా ఈ అక్రమాలు కొనసాగించారని ఈడీ పేర్కొంది. ఇక ఈడీ దాడుల సమయంలో రూ.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దాడుల వివరాలతో ఈడీ అధికారిక ప్రకటన విడుదల చేసింది.మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మనీ లాండరింగ్, హవాలా మార్గాల్లో అక్రమాలకు పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు దాడులు చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల్లో కూడా అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అక్రమ మార్గంలో పెద్దమొత్తంలో డబ్బును స్థిరాస్తి రంగంలో పెట్టుబడి పెట్టినట్లు ఈడీ వెల్లడించింది. ఇంకా కొన్ని బ్యాంకు లాకర్లు తెరవాల్సి ఉందని తెలిపింది.ఇక గుడెం బ్రదర్స్ అక్రమ దందాలను బినామీల పేరిట చేసినట్లు ఈడీ గుర్తించింది. వారి వివరాలు సేకరించే పనిలో కూడా ఈడీ ఉంది. తమ పేర్లు బయటకు రాకుండా ఉండేందుకే పలువురు బినామీల పేరిట వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. బినామీల ఖాతాలు, ఇళ్లలోనూ సోదాలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఇదిలా ఉంటే.. గూడెం సోదరులను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు వెనకేసుకొచ్చారు. తమ ఎమ్మెల్యే ఎలాంటి తప్పు చేయలేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. ఈడీ కక్షపూరితంగా దాడులు చేస్తోందని ఆరోపించారు. ఐటీ చెల్లిస్తూనే వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించారు. కానీ, ఈడీ అధికారికంగా పట్టుకున్న డబ్బులు, గుర్తించిన అక్రమాల వివరాలను వెల్లడించింది.

# ఇది ప్రతిపక్షాల లోక్‌సభ!



పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 16వ, 17వ లోక్‌సభల్లో లేనట్టి ఒక బలవత్తరమైన పార్లమెంటరీ ప్రతిపక్షాన్ని ప్రభవింపచేశాయి. గత రెండు సార్వత్రక ఎన్నికల (2014, 2019)ల్లో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నది. అయితే ఆ సార్వత్రక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుసగా కేవలం 44, 52 సీట్లు మాత్రమే లభించాయి. తత్కారణంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాను పొందలేకపోయింది. ఇతర బీజేపీ యేతర పక్షాలకు కాంగ్రెస్ కంటే ఇంకా తక్కువ సీట్లు మాత్రమే లభించాయి. తత్ఫలితంగా బీజేపీ, ఎన్నికలకు పూర్వమే ఆ పార్టీతో పొత్తు పెట్టకున్న పార్టీలు, అప్రకటిత మిత్రపక్షాల (వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్) సంఖ్యా బలం, సభలో అయినదానికీ కానిదానికీ అవి చేసిన ఎడతెగని రభసలో ప్రతిపక్షం వాణి విన్పించకుండా పోయింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే విపక్షం గొంతును పూర్తిగా నొక్కి వేశారు. పాలక, ప్రతిపక్షాల సంఖ్యా బలాల్లో తీవ్ర తేడా ఉన్న దృష్ట్యా, మహోన్నత పార్లమెంటరీ సంప్రదాయాలను సభలో ఎలా నిలబెట్టుకోవాలనే విషయమై విధ్యుక్త ధర్మ స్ఫూర్తితో ఆలోచించలేదు. కనీస మాత్రంగానైనా ఆ సంఖ్యా బలాల అసమతౌల్యతను పరిగణనలోకి తీసుకోలేదు. ఇక చెప్పేదేముంది? సభా కార్యకలాపలు సరిగా సాగలేదు. చర్చలు జరగకుండానే బిల్లులు ఆమోదం పొందడం సాధారణమై పోయింది. ఈ శోచనీయ వాస్తవం సభలోని ప్రతిపక్షాలకే కాదు, సభ వెలుపలి చైతన్యశీల పౌరులకూ అర్థమయ్యేందుకు ఎంతో కాలం పట్టలేదు పార్లమెంటు ఉభయ సభలూ సమున్నత రీతిలో పనిచేయడం లేదని నిష్పాక్షిక పరిశీలకులు ఎందరో వాపోయారు. భారత పార్లమెంటు ఘనమైన సంప్రదాయాలను పునరుద్ధరించేందుకు 2024 సార్వత్రక ఎన్నికల ఫలితాలు అటు పాలకపక్షం, ఇటు ప్రతిపక్షం రెండిటికీ ఒక మహదవకాశాన్ని కల్పించాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపాన్ని మాత్రమే కాదు, దాని సారాన్ని సైతం సముదాత్తం చేసేందుకు మన ప్రజా ప్రతినిధులకు ఒక గొప్ప అవకాశం లభించింది. 236 మంది సభ్యులతో ప్రతిపక్షం సుదృఢంగా ఉన్నది. దేశ ప్రజల తరఫున ప్రభుత్వ వ్యవహారాలను నిశితంగా విమర్శించేందుకు, సరిదిద్దేందుకు ప్రతిపక్షానికి ఇదొక చక్కని అవకాశం. సభా కార్యకలాపాలను ప్రతిపక్షాలు అడ్డుకోవడమనేది న్యాయబద్ధమైన పార్లమెంటరీ మార్గమని, అది 'ప్రజా స్వామ్యానికి పూర్తిగా అనుకూలమైనది' అని కీర్తిశేషుడు అరుణ్ జైట్లీ వాదించేవారు. ఆయన పదే పదే చేసిన వాదన ఒక కట్టుకథ. ఆ వాదనకు విరుద్ధమైనదే సత్యం, అదే ప్రజాస్వామ్య సమున్నతికి దోహదం చేసేది. సరే, కొత్త లోక్‌సభలో ప్రతిపక్షం ఏమి చేయాలి? కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 'న్యాయ్ పత్ర'తో ఉపక్రమించాలి. అందులో ఈ క్రింది హామీలు ఉన్నాయి: 'పార్లమెంటు ఉభయ సభలూ ఒక సంవత్సరంలో 100 రోజుల పాటు సమావేశమయ్యేలా చూస్తాం. గతంలో పరిఢవిల్లిన సమున్నత పార్లమెంటరీ సంప్రదాయాలను ఉభయ సభల్లో పునరుద్ధరించి నిష్ఠాబద్ధంగా పాటించేందుకు నిబద్ధమవుతాము'బీ 'ఒక వారంలో ఒక రోజును లోక్‌సభలోను, రాజ్యసభలోను ప్రతిపక్షాలు సూచించిన ఎజెండాపై చర్చించేందుకు పూర్తిగా వినియోగించేందుకు వాగ్దానం చేస్తున్నాం'బీ 'ఉభయ సభల సభాపతులు ఏ రాజకీయ పార్టీలతోను సంబంధాలు నిలుపుకోకుండా, తటస్థంగా ఉండేలా చేసి, 'సభాపతి సంభాషించడు' (స్పీకర్ డజ్ నాట్ స్పీక్') అనే ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఎల్లెడలా ఆమోదయోగ్యమైన ప్రమాణాన్ని పాటించేందుకు హామీ పడుతున్నాం'. ఈ వాగ్దానాలను నెరవేర్చేందుకు ఇండియా కూటమి దృఢ సంకల్పంతో నిబద్ధమవుతుంది. పార్లమెంటు ఉభయ సభలూ ఏడాదికి 100 రోజుల చొప్పున సమావేశమవడం, వారంలో ఒక రోజు సభా కార్యకలాపాలను ప్రతిపక్షాల ఎజెండాపై చర్చకు పరిమితం చేయడం, తటస్థ సభాపతులు తదితర అంశాలపై బీజేపీకి ఎటువంటి ఆక్షేపణలు ఉండడానికి వీలులేదు. నరేంద్ర మోదీ, ఆయన కారణంగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల ఫలితాలు కలిగించిన దిగ్భ్రాంతి నుంచి తేరుకున్నట్టు కనిపిస్తున్నారు. బీజేపీకి 370, ఎన్డీఏకు 400కు పైగా సీట్లు తప్పక వస్తాయన్న పాలకపక్ష శ్రేణుల ఆశలు ఘోరంగా వమ్ము అయ్యాయి. బీజేపీకి 240 సీట్లు మాత్రమే దక్కగా ఎన్డీఏకు లభించిన సీట్లు 400కు లోపు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ బీజేపీ అగ్రనాయకులు విజయోత్సవాలు జరుపుకునేందుకు ప్రయత్నించారు గానీ పార్టీ కార్యకర్తలు వారి ఆనందోత్సాహాలలో పాలు పంచుకోలేకపోయారు. 'మైనారిటీ సర్కార్' అనే (వెటకారపు) ముద్ర బీజేపీ నాయకత్వాన్ని వెంటాడుతూనే ఉంటుంది. దానిని తొలగించుకునేందుకు వారు శతథా ప్రయత్నిస్తారనడంలో సందేహం లేదు. ఈ ప్రయత్నాలలో భాగంగా వైఎస్ఆర్‌సీపీ (నలుగురు సభ్యులు), ఆప్ (3), ఆర్ఎల్‌డీ (2), జేడీఎస్ (2), ఎజిపి (1), ఎజెఎస్‌యు (1), హెచ్ఎఎమ్ (1), ఎస్‌కేఎమ్ (1)లను బీజేపీ ప్రలోభపెట్టే అవకాశమున్నది. 12 మంది సభ్యులు గల జనతాదళ్ (యునైటెడ్) పార్టీ కూడా అందుకు మినహాయింపు కాబోదు. ఈ పార్టీలలో కొన్ని ఇప్పటికే ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్నాయి. అయినప్పటికీ వాటి సభ్యులను తన పక్షంలో మిళితం చేసుకునేందుకు బీజేపీ వెనుకాడబోదు (శివసేనకు ఏమయిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోండి).రాజ్యాంగం 10వ షెడ్యూలులో అనేక లొసుగులు ఉన్నాయి. వాటి ఆలంబనతో చిన్న పార్టీల ఎంపీలు సురక్షితంగా పార్టీ ఫిరాయింపునకు పాల్పడవచ్చు. తన సంఖ్యా బలాన్ని పెంచుకునేందుకు ఆ లొసుగులను బీజేపీ ఉపయోగించుకోకుండా ఉంటుందా? పాలక పక్షం కుటిల ప్రయత్నాలను ప్రతిఘటించేందుకు కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 ఒక ప్రతిపాదన చేసింది: 'రాజ్యాంగం పదవ షెడ్యూలును సవరించి ఫిరాయింపుల (ఏ పార్టీ తరఫున లోక్‌సభ లేదా శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యే, ఎంపీ)కు పాల్పడినవారు ఆటోమెటిక్‌గా శాసనసభ లేదా లోక్‌సభ సభ్యత్వానికి అనర్హులు అయ్యేలా చూస్తాము'. చెప్పవచ్చినదేమిటంటే రాజ్యాంగం పదవ షెడ్యూలుకు ప్రతిపక్షం ఒక సవరణను ప్రతిపాదించి తీరాలి. పాలక పక్షం ఆ సవరణ బిల్లును వ్యతిరేకించిన పక్షంలో ప్రజలు అధికార పార్టీని తప్పకుండా గర్హిస్తారు. ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించేందుకు పాలకులు పూనుకుంటున్నారన్న వాస్తవం వారికి విశదమవుతుంది. సరే, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో బీజేపీ పాలన చాలా దుర్బలంగా ఉందన్న విషయాన్ని మరి చెప్పనవసరం లేదు. మౌలిక సదుపాయాలను ఇతోధికంగా అభివృద్ధిపరచడంపై ఎవరికీ ఎటువంటి అభ్యంతరముండబోదు. అయితే కొత్త ఉద్యోగాల సృష్టి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమే ఆర్థిక విధానాల లక్ష్యంగా ఉండి తీరాలి. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ రెండు విషయాలలోను విఫలమయింది. తత్కారణంగానే ఓటర్ల తీర్పు బీజేపీ, ఎన్డీఏకు వ్యతిరేకంగా వచ్చింది. మరి బీజేపీ నాయకత్వం తన విధానపరమైన పొరపాట్లను సరిదిద్దుకుంటుందా లేదా అనే విషయం పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌లో స్పష్టమవుతుంది. కాంగ్రెస్ మేనిఫెస్టో 2024ను అనుసరించి ఉద్యోగాల విషయమై మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్, ఇండియా కూటమి తీవ్ర ఒత్తిడి తేవాలి: 'మేము గుత్తాధిపత్యాలను, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం'బీ 'ప్రభుత్వం నుంచి ప్రతి వ్యాపారవేత్త/ పారిశ్రామికవేత్తకు లభ్యం కాగల ఆర్థిక సహాయం, భౌతిక వనరులు, వ్యాపార అవకాశాలను ఏ ఒక్క కంపెనీ లేదా వ్యక్తి మాత్రమే పూర్తిగా స్వాయత్తం చేసుకోవడానికి వీలు లేకుండా చర్యలు చేపడుతాం': పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించే వ్యాపార సంస్థలకు అనుకూలంగా మా విధాన ప్రాధాన్యాలు ఉంటాయి'బీ కేంద్ర ప్రభుత్వంలోను, దాని అనుబంధ ప్రభుత్వరంగ సంస్థలలో 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి'బీ కార్పొరేట్ కంపెనీలు పన్ను రాయితీలు పొందేందుకు షరతుగా కొత్త "ఎంప్లాయ్‌మెంట్ లింక్‌డ్ ఇన్సెంటివ్" (ఇఎల్ఐ) పథకాన్ని ప్రారంభించాలి'బీ పట్టణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల పునర్నిర్మాణంలో పట్టణ పేదలకు ఉపాధి కల్పించేందుకు పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిస్తాం'బీ 'గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల ద్వారా అమలయ్యే జలవనరుల పునరుద్ధరణ, బంజరు భూముల పునరుజ్జీవన కార్యక్రమాలను ప్రారంభించి నిరక్షరాస్యులు, అనిపుణ యువతకు ఉపాధి కల్పించాలి'. ప్రతిపక్షాలు తామే ప్రభుత్వమన్న రీతిలో ప్రవర్తించాలి. పద్దెనిమిదవ లోక్‌సభలో తమకు లభించిన అవకాశాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకుని ప్రభుత్వానికి పాలన సాగవలసిన తీరు తెన్నులను నిర్దేశించాలి. మెజారిటీ కొరవడిన బీజేపీ ప్రభుత్వం, కొత్త శక్తిమంతమైన ప్రతిపక్షానికి ఎలా ప్రతిస్పందించనున్నదో గమనించడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

# డిప్యూటీ స్పీకర్ బరిలో ఎవరు



**విజయవాడ, జూన్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. అసెంబ్లీ సమావేశాల తొలి రోజు కండువాలతో వచ్చిన సభ్యులతో సభ కళకళలాడింది. ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకే నామినేషన్ రావడంతో అయ్యన్నపాత్రుడి ఎన్నిక ఏకగ్రీవమైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎమ్మెల్యేను స్పీకర్‌గా ప్రకటించారు అధికారులు. అయ్యన్న.. సభలో ఉన్న కూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత సీనియర్. ఇప్పటి వరకు 7 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఒకసారి అనకాపల్లి ఎంపీగానూ విజయం సాధించారు. పలు శాఖలకు మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.డిప్యూటీ స్పీకర్ పదవి ఎవరికి దక్కబోతుందన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది. స్పీకర్ చైర్ టీడీపీకి దక్కింది, డిప్యూటీ స్పీకర్ పదవి మిత్రపక్షాలకు ఇస్తారా అన్న చర్చ నడుస్తోంది. దీనిపై కూటమి పార్టీల మధ్య పెద్ద ఎత్తున డిస్కషన్ సాగుతోంది. ఇక్కడ కొన్ని సమీకరణాలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడికి స్పీకర్ పదవి దక్కింది. రాయదర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులుకు డిప్యూటీ దక్కే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. కాల్వ కూడా టీడీపీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉంది. రెండు పదవులు బీసీలకు ఇవ్వడం ద్వారా కూటమి బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందనే సంకేతాలు తీసుకెళ్లేలా అధినేతలు కసరత్తు చేస్తున్నారు. లేదంటే జనసేన కూడా దక్కే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంలో మూడు పార్టీల మధ్య చర్చలు నడుస్తున్నాయి. జనసేనకు ఇస్తే ఓసీ సామాజిక వర్గానికి చెందిన నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవికి ఇస్తారనేది టాక్.దీనికి మించి మరో లెక్క కూడా లేకపోలేదు. స్పీకర్, డిప్యూటీ ఒకే ప్రాంతానికి చెందిన వారికి రెండు పదవులు ఇవ్వకుండా వేరు వేరు ప్రాంతాలకు ఇవ్వడం ద్వారా అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందని అధినేతలు లెక్కలు వేస్తున్నారు. ఇక పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు చీఫ్ విప్ దక్కే అవకాశం ఉన్నట్లు సభ్యుల మధ్య చర్చ నడుస్తోంది. తొలిరోజు సభలో 171 మందితో ప్రమాణం చేయించారు ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యచౌదరి. వ్యక్తిగత కారణాలతో ప్రమాణం చేయని ముగ్గురు ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, పితాని సత్యనారాయణ, వనమాడి వెంకటేశ్వరరావు రెండో రోజు సభలో ప్రమాణం చేస్తారు. సభ్యుల ప్రమాణం తర్వాత సభలో స్పీకర్ పేరు ప్రకటిస్తారు.తొలి రోజు సభలో ఉద్విగ్న క్షణాలు కనిపించాయి. బాలకృష్ణతో కలిసి వచ్చిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీ మెట్లపై ప్రణమిల్లారు. రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీలో చంద్రబాబు అడుగుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎంకు స్వాగతం పలికారు. అంతకు ముందు ఉండవల్లి నివాసం నుంచి బయల్దేరిన చంద్రబాబు.. వెంకటపాలెంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యేలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసెంబ్లీ హాల్‌లో అడుగుపెట్టిన చంద్రబాబు-పవన్ ఆలింగనం చేసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సీఎం చంద్రబాబుతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం స్వీకారం చేయించారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. నారాలోకేష్‌తోపాటు మిగతా మంత్రులు ప్రమాణం చేశారు. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన వైఎస్ జగన్.. ప్రొటెం స్పీకర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీలో రివెంజ్ పాలిటిక్స్



**గుంటూరు, జూన్ :** ఏపీలో రివెంజ్ పాలిటిక్స్‌కు అడుగు పడిందా? లేక చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందా? సమయం తెల్లవారుజామున 5 గంటల 30 నిమిషాలు.. తాడేపల్లిలోని వైసీపీ అధినేత జగన్ క్యాంప్ కార్యాలయానికి కూతవేటు దూరంలో మొదలయ్యాయి కూల్చివేతలు. కూలిపోయేది నిర్మాణంలో ఉన్న వైసీపీ పార్టీ కార్యాలయం.. తూర్పున సూర్యుడు ఉదయించేలోపే జరగాల్సినదంతా జరిగిపోయింది. నిర్మాణంలో ఉన్న కార్యాలయం నేలమట్టమైంది. ఇక ఆ తర్వాత మొదలైంది అసలు రాజకీయం.రాజకీయాల గురించి మాట్లాడుకునేముందు అసలు ఆ నిర్మాణాలు ఎందుకు కూల్చారో తెలుసుకుందాం.. తాడేపల్లిలోని 202/ం1 సర్వే నంబర్‌లో ఉంది ఈ నిర్మాణం. ఈ సర్వే నంబర్‌లో 2 ఎకరాల భూమిని పార్టీ కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించింది. అంటే వైసీపీ హయాంలో.. వారి పార్టీ కోసం కేటాయించిన స్థలం. అయితే ఈ స్థలం అంతకుముందు ఇరిగేషన్ శాఖ స్వాధీనంలో ఉంది. అయితే ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇరిగేషన్ శాఖ అంగీకరించలేదు. సీఆర్డీఏ, ఓఓఇ, రెవెన్యూశాఖలు కూడా ఈ భూమిని ఆ పార్టీకి అంగీకరించలేదు. అంతేకాదు అసలు భవన నిర్మాణానికి కనీసం ప్లాన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోలేదు. నీటిపారుదలశాఖకు చెందిన భూమిలో ఇలా అక్రమంగా, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధం. అందుకే ముందుగా నోటీసులు ఇచ్చాం.. ఆ తర్వాత కూల్చేశాం.. ఇది ప్రభుత్వాధికారులుచెబుతున్న మాట.అయితే వైసీపీ ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ కార్యాలయ నిర్మాణం చేపట్టిందని గుంటూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాంటూ అధికారులను కోరారు. ఈ ఫిర్యాదుపైనే అధికారులు స్పందించారు. నోటీసులు జారీ చేశారు.. కూల్చేశారు. కానీ ఈ గ్యాప్‌లో దీనిపై హైకోర్టును ఆశ్రయించింది వైసీపీ పార్టీ.. తమ పార్టీ కార్యాలయాన్ని కూల్చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై కోర్టు కూడా విచారణ చేపట్టింది. అయితే ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు.కానీ అంతలోనే జరగాల్సిన తతంగాన్ని జరిపించేశారు అధికారులు.. ఇదీ జరిగింది.. ఇక రాజకీయాల విషయానికి వద్దాం.. వైసీపీ పార్టీ కార్యాలయ కూల్చివేత ముమ్మాటికి కక్ష పూరిత రాజకీయమే అంటోంది వైసీపీ. దీనిపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. చంద్రబాబు ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగు అయిపోయాయంటూ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యవాదులంతా చంద్రబాబు దుశ్చర్యల్ని ఖండించాలని కోరారు. ఇక వైసీపీ నేతలు కూడా కోర్టులో కేసు ఉండగా అధికారులు ఎలా చర్యలు తీసుకుంటారంటూ మండిపడుతున్నారు.జలవనరుల శాఖకు చెందిన స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపించినట్లు తెలిపింది సీఆర్డీఏ,.. వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఇరిగేషన్ శాఖ అభ్యంతరాల్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023 ఫిబ్రవరిలో వైసీపీ ఆఫీసుకు భూమి ఇవ్వలేమని ఇరిగేషన్ ఈఎన్సీ చెప్పారని గుర్తు చేస్తుంది సీఆర్డీఏ,. వైసీపీ కోరిన భూమిలో తాము ట్రైనింగ్ కార్యాలయం నిర్మించదలిచినట్లు అప్పటి ఈఎన్సీ చెప్పారని.. తీవ్ర అభ్యంతరం తెలిపినప్పటికి వైసీపీ ఆఫీస్ నిర్మాణం చేపట్టారంటోంది సీఆర్డీఏ,.ఇదే కాదు.. అనకాపల్లిలో నిర్మిస్తున్న వైసీపీ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కూడా నోటీసులు ఇచ్చింది గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్.. అనుమతులు లేకుండా ఆఫీస్ నిర్మించారన్న జనసేన నేత మూర్తి యాదవ్ ఫిర్యాదుతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఎండాడలో 175/4 సర్వే నెంబర్లోని రెండు ఎకరాల భూమిని అక్రమంగా సేకరించి ఆఫీస్ నిర్మాణం చేపట్టారని మూర్తి యాదవ్ ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు.అయితే ఈ చర్యలన్నింటిని కక్షపూరిత చర్యలని ఆరోపిస్తున్నారు వైసీపీ నేతలు దీనిపై కూడా టీడీపీ నేతలు కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇస్తున్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టి.. ఇప్పుడు చర్యలు తీసుకుంటే దానికి కక్షపూరిత రాజకీయాలంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదంటూ కౌంటర్ ఇస్తున్నారు. గతంలో జగన్ ప్రజావేదికను కూల్చేశారు కాబట్టి ఇప్పుడు తాము కూడా.. కూల్చివేతలతోనే పని ప్రారంభిస్తాం.. అన్నట్టుగా టీడీపీ పని చేస్తోందా? అనేది కొందరి ప్రశ్న. అక్రమంగా నిర్మించుకున్న దానిని కూల్చేస్తే తప్పేముందనేది మరికొందరి వాదన.

# కుప్పం పై చంద్రబాబు దృష్టి



**తిరుపతి, జూన్ :** ఏపీ అసెంబ్లీలో చిట్ట చివరి నియోజకవర్గం కుప్పం. 1989 వరకు బాగా వెనుకబడినప్పటికీ.. సీఎం చంద్రబాబు వరుస విజయాలతో ఆ ప్రాంత అభివృద్ధి దశ తిరిగింది. కుప్పం నుంచి వరుసగా 8వ సారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు 4వ సారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. సీఎంగా చంద్రబాబు ఉన్నంత కాలం ప్రతి ప్రాజెక్టు, స్కీం ను ప్రయోగాత్మకంగా ప్రారంభించేందుకు కుప్పం వేదిక అవుతూ వచ్చింది. సీఎం చంద్రబాబు కూడా సొంత నియోజకవర్గానికి హై ప్రియారిటీ ఇస్తూ వచ్చారు. అయితే 2019లో అధికారాన్ని కోల్పోయిన చంద్రబాబు ప్రతిపక్ష నేతగా కుప్పం అభివృద్ధిని చూడలేక పోయారు. కుప్పం ప్రజలకు ఇచ్చిన హామీలు తీర్చలేకపోయారు. ఇందుకు కుప్పంపై వైసీపీ ప్రభుత్వం వివక్షనే కారణమంటూ ఐదేళ్లుగా ఆరోపిస్తూ వచ్చారు. చంద్రబాబు సొంత ఇలాకాలో ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు.. పలు ప్రాజెక్టులను పూర్తి చేయడమే టార్గెట్?గా చేసుకోబోతున్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పంకు తీసుకొచ్చేందుకు బ్రాంచ్ కెనాల్ నిర్మాణ పనులను చేపట్టి దాదాపు 85 శాతం వరకు పనులను పూర్తి చేశారు. అయితే ఈలోపు అధికారం చంద్రబాబు చేజారి పోగా వైసీపీ సర్కార్ హంద్రీనీవాను పూర్తి చేయలేక పోయింది. అయితే కుప్పంకు హంద్రీనీవా నీటిని తీసుకొచ్చామని చెప్పే ప్రయత్నం వైసీపీ చేసిందని టిడిపి ఆరోపించింది.ఎన్నికలకు ముందు హంద్రీనీవా నీటిని కుప్పంకు విడుదల చేస్తున్నట్లు హడావిడి చేసినా నీళ్లు మాత్రం కుప్పంకు రాకపోవడంతో ఇప్పుడు ఆ ప్రాజెక్ట్ చంద్రబాబు సర్కార్?కు అత్యంత ముఖ్యం అయింది. దీంతో గత ఐదేళ్లుగా హంద్రీనీవా కాలువ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలిస్తూ వచ్చారు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు. హంద్రీనీవాను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నారు. ఇక రామకుప్పం మండలం ననియాల వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టును చేపట్టిన సీఎం చంద్రబాబు 2019 నాటికి దాదాపు పూర్తి చేశారు. అయితే గత 5 ఏళ్లలో టూరిజం పర్యాటకులకు అందుబాటులోకి రాకపోగా ఇప్పుడు 5 ఏళ్ల తర్వాత దాన్ని తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు సరిహద్దులో ఎకో టూరిజం ప్రాజెక్టును పూర్తి చేసి పర్యాటక రంగ అభివృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు భావించారు. శిక్షణ పొందిన ఏనుగులున్న ననియాల ఎలిఫెంట్ క్యాంప్?లో పర్యాటకులను ఆకట్టుకునేలా అంబారీ స్వారీ, విలాసవంతమైన కాటేజీలు, రిసార్టు, హెలిప్యాడ్ నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే ఆ ప్రాజెక్టు గత ఐదేళ్లపాటు నిరుపేయంగానే ఉండి పోవడంతో ఇప్పుడు సీఎం చంద్రబాబు కుప్పం అభివృద్ధిపై చేస్తున్నారు.మరోవైపు కుప్పంలో రహదారుల విస్తరణ, పాలార్ ప్రాజెక్టు కీలకంగా మారింది. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల మధ్య గత కొన్ని దశాబ్దాలుగా అంతరాష్ట్ర సమస్యగా మారిన పాలారు ప్రాజెక్టు పనులకు గత ప్రభుత్వం పాలన అనుమతులను ఇచ్చింది. దాదాపు రూ.140 కోట్లు నిధులు విడుదలకు అనుమతించింది.

# పండుగలా ఫించను కార్యక్రమం



**విజయవాడ, జూన్ :** ఏపీలో కొత్త ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ పై కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచుతూ ఫైల్ పై చంద్రబాబు సంతకం చేసిన సంగతి తెలిసింది. ఈనెల నుంచి నాలుగు వేల రూపాయల పింఛన్ లబ్ధిదారులకు అందం ఉంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఏప్రిల్ నుంచి ఈ పెంపుదల వర్తింపజేయనున్నారు. నాలుగు వేల రూపాయల పింఛన్ మొత్తం తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెల కు సంబంధించి పెండింగ్ మూడు వేల రూపాయలు అందించనున్నారు. మొత్తంగా కలిపి రూ.7000 పింఛన్ లబ్ధిదారులకు అందనుంది. అయితే వాలంటీర్లతో పంపిణీ చేయాలా? ప్రభుత్వ సిబ్బందితో అందించాలా? అన్నదానిపై చర్చ జరుగుతోంది.ఈ ఎన్నికల్లో పింఛన్ల అంశం ప్రధాన హామీగా మారింది. రాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని 3,500 పెంచుతామని జగన్ హామీ ఇచ్చారు. అది కూడా రెండు విడతల్లో 250 చొప్పున పెంచుతామని చెప్పుకొచ్చారు.అయితే చంద్రబాబు మాత్రం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నాలుగు వేల రూపాయల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు. అది కూడా ఏప్రిల్ నుంచి మూడు నెలల పాటు పెండింగ్ మొత్తాన్ని కూడా జూలైలో చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి రావడంతో జూలై 1న పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచుతూ అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. కొత్త పింఛన్ పుస్తకాలతో పాటు నగదు అందించాలని ఆదేశించారు.వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు ?4,000 పింఛన్ అందునుంది. అదేవిధంగా ట్రాన్స్ జెండర్లు, గీత కార్మికులు, మత్స్యకార వర్గాలకు 4000 రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దివ్యాంగులకు మూడు వేల నుంచి 6 వేలకు, పూర్తిస్థాయి దివ్యాంగులకు ఐదు నుంచి 15 వేలకు పింఛన్ మొత్తాన్ని పెంచనున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి ఐదు వేల నుంచి పదివేలకు పింఛన్ మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల ఒకటి నుంచి ఈ పెంపుదల అమలు కానుంది. అయితే ఈ పింఛన్లను వాలంటీర్ల ద్వారా అందించాలా? లేకుంటే సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలా అన్నది ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈనెల 24న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనుంది. ఈనెల పెన్షన్లకు సంబంధించి ఎటువంటి నగదు సమస్య లేదని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. లై ఒకటో తేదీన ఇంటి వద్దనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తామని మంత్రి ఎస్.సవిత తెలిపారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు ఏ ఇబ్బంది కలగకూడదని భావించి ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేపడుతున్నామని ఏపీ బీసీ, చేనేత జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత చెప్పారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పెనుగొండ నియోజకవర్గానికి వచ్చిన టీడీపీ నాయకురాలు సవితకు పార్టీ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారుబెంగళూరు విమానాశ్రయం నుంచి వయా సోమందేపల్లి, పెనుగొండ పట్టణము వరకు 6 గంటల పాటు సుదీర్ఘంగా మంత్రి సవిత ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఏపీ మంత్రి సవిత మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలుపుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమంతో పాటు అభివృద్ధిపై నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చేనేతకు పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేనేత కార్మికుల బతుకుల్లో అభివృద్ధి వెలుగులు విరజిల్లుతాయన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, రాయితీ, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మంది పదవి ఇచ్చినందుకు చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు ఇచ్చిన బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి శాఖలలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ నియోజకవర్గంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేస్తానని, తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను అన్నారు. త్వరలో బిసి కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్లలో వెనకబడిన తరగతుల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించే దస్త్రంపై తొలి సంతకం చేశామన్నారు

# అసెంబ్లీకి హాజరు కాకపోతే అనర్హతకు చాన్స్



**విజయవాడ, జూన్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఊహించని మలుపులు తిరిగాయి. ఓడలు బండ్లు అయ్యాయి. బండ్లు ఓడలయ్యాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రధాన ప్రతిపక్ష హోదాకు దూరమయింది. పూలమ్మిన చోట రాళ్లమ్మడం ఎలా అని జగన్ అనుకుంటున్నారేమో కానీ అసెంబ్లీ వైపు రావాలని ఆయన అనుకోవడం లేదు. ప్రమాణ స్వీకారం తప్పనిసరి కాబట్టి ఆ తంతు పూర్తి చేసి పది నిమిషాలు కూడా అసెంబ్లీలో ఉండకుండా వెళ్లిపోయారు. స్పీకర్ ఎన్నికలకు తాను దుమ్మా కొట్టారు. తన పార్టీ సభ్యులను కూడా వెళ్లనీయలేదు. ఇటీవల పార్టీ కార్యకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలను బట్టి చూస్తే భవిష్యత్ లో కూడా అసెంబ్లీకి హాజరయ్యే అవకాశాలు లేవని ఎక్కువ మంది నమ్ముతున్నారు. గతంలో అలా అసెంబ్లీని బహిష్కరించిన ట్రాక్ రికార్డు జగన్‌కు ఉండటమే దీనికి కారణం. ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా అసెంబ్లీకి వచ్చేందుకు జగన్ సిద్ధంగా లేరు. ముఖ్యంగా అయ్యన్న పాత్రుడు స్పీకర్ గా ఉన్నారు. ఆయనను అధ్యక్షా అని సంబోధించేందుకు జగన్ మనస్థత్వం అంగీకరించని వైఎస్ఆర్‌సీపీ నేతలే చెబుతూంటారు. అలాగే అసెంబ్లీలో పవన్ కల్యాణ్, రఘురామకృష్ణరాజు వంటి వాళ్లు ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి తన రాజకీయాన్ని వ్యక్తిగతంగా.. రాజకీయంగా చూడరు. మొత్తం ఒకటే అనుకుంటారు. రాజకీయ ప్రత్యర్థులు వ్యక్తిగత శత్రువులుగానే చూస్తారు. పార్టీ, ప్రభుత్వం ఒకటే అని అధికారంలో ఉన్నప్పుడు అనుకునేవారు. అలా.. ఇతర పార్టీల నేతలతో రాజకీయంగా ఓ సంబంధం.. వ్యక్తిగతంగా మరో సంబంధం ఉండదని.. మొత్తం ఒకటేనని నమ్ముతారు. అందుకే తన రాజకీయ ప్రత్యర్థుల్ని శత్రువులుగానే పరిగణించి.. ఎక్స్‌ట్రీమ్ ఎటాక్ చేస్తారు. దాని వల్ల ఆయనకు రాజకీయంగానే కాదు వ్యక్తిగతంగానూ అందరూ శత్రువులుగానే కనిపిస్తున్నారు. గత అసెంబ్లీలో వైసీపీ సభ్యులు .. టీడీపీ సభ్యులకు చేసిన అవమానాలకు ఖచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటారని దాని వల్ల జగన్ పైనే ఎక్కువగా ఎటాక్ చేస్తారని అనుకుంటున్నారు. ఈ పరిస్థితుల్ని ఎదుర్కోవడం కన్నా.. అసెంబ్లీకి దుమ్మా కొట్టడమే మంచిదని జగన్ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఇలాంటి కౌరవ సభలో మనం ఏదో మాట్లాడుతామని.. పోరాటం చేస్తామని నాకైతే నమ్మకం లేదు అని జగన్ నేరుగా పార్టీ కార్యవర్గ సమావేశంలో చెప్పారు. అంటే ఎమ్మెల్యేలు కూడా హాజరవకూడదని ఆయన ఉద్దేశం అనుకోవచ్చు. జగన్ కు గతంలోనూ అసెంబ్లీని బహిష్కరించిన రికార్డు ఉంది. 2017లో పాదయాత్ర ప్రారంభించే ముందు అసెంబ్లీని బహిష్కరించారు. తన పార్టీ ఎమ్మెల్యేలను కూడా ఆయన అసెంబ్లీకి వెళ్లడానికి అంగీకరించలేదు. నాలుగు సెషన్ల పాటు ఈ బహిష్కరణ సాగింది. అప్పట్లో టీడీపీ మాత్రమే అసెంబ్లీని నిర్వహించింది. టీడీపీ సభ్యులే ప్రతిపక్ష పాత్ర కూడా పోషించారు. జగన్ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గలేదు. గతంలో తమిళనాడులో జయలలిత, ఉమ్మడి ఏపీలో ఎన్టీఆర్ అసెంబ్లీలను బహిష్కరించారు కానీ.. వారి ఎమ్మెల్యేలు మాత్రం సభకు వెళ్లారు. చంద్రబాబునాయుడు కూడా అసెంబ్లీని బహిష్కరించి శపథం చేసి వచ్చేశారు కానీ.. టీడీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం తాను వెళ్లకపోతే ఎమ్మెల్యేలు కూడా వెళ్లాల్సిన అవసరం లేదనుకుంటారు. అందుకే ఎమ్మెల్యేలతో కూడా సమావేశాలను బహిష్కరింప చేసే అవకాశాలను కొట్టి పారేయలేమని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసినా వరుసగా మూడు సెషన్లకు స్పీకర్ అనుమతి తీసుకోకుండా దుమ్మా కొడితే.. అనర్హతా వేటు వేసేందుకు స్పీకర్‌కు సర్వాధికారాలు ఉంటాయి.

# సచివాలయంలో మంత్రి నారా లోకేష్ బాధ్యతల స్వీకరణ

## - విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల అభినందనలు

## - మెగా డిఎస్సీ విధివిధానాల ఫైలుపై లోకేష్ తొలి సంతకం



**అమరావతి:**రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సచివాలయంలో సోమవారం నిరాడంబరంగా బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సచివాలయంలోకి అడుగుపెట్టిన లోకేష్.. 4వ బ్లాక్ ఫస్ట్ ఫ్లోర్ రూమ్ నంబర్ - 208 చాంబర్ లో బాధ్యతలు చేపట్టారు. మెగా డీఎస్సీ విధివిధానాలకు సంబంధించిన ఫైలుపై లోకేష్ తొలిసంతకం చేసి, కేబినెట్ కు పంపారు. పలువురు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ నాయకులు లోకేష్ ను కలిసి అభినందనలతో ముంచెత్తారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, టీజీ భరత్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బోండా ఉమామహేశ్వరరావు, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ వేమూరి రవికుమార్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ప్రధాన కార్యదర్శి రవినాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం, మాజీ ఎమ్మెల్సీలు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎస్ రామకృష్ణ, బుద్ధా నాగ జగదీష్, అంగర రామ్మోహన్ రావు, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ నాగుల్ మీరా తదితరులు లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపారు.

# వ్యాయామం చేయకుండానే బెల్లీ ఫ్యాట్ తగ్గించేసుకోండిలా...

పొట్ట కనిపించకుండా ఉండేందుకు వదులైన దుస్తులు కొనడం మొదలుపెట్టి విసిగిపోయారా? పొత్తి కడుపు పెరగడం వల్ల నిల్చున్నప్పుడు మీ కాళ్లను మీరే చూసుకోవడానికి ఇబ్బంది పడిపోతున్నారా? ఇదే నిజమైతే బాన పొట్టను తగ్గించుకోవాల్సిన సమయం వచ్చినట్టే! ఇది చాలా మందికి ఉండే సమస్య. అయితే దీని గురించి అంతగా గాబరా పడనక్కర్లేదు. కొన్ని మంచి ఆరోగ్య సూత్రాలతో పొట్టను సులువుగా తగ్గించుకోవచ్చు. శరీరంలో కొవ్వు ముఖ్యంగా పొట్ట చుట్టు ఉండే కొవ్వు వలన రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నది అందరికీ తెలిసిన విషయమే. పొట్ట చుట్టు కొవ్వు వల్ల మోకాలి నొప్పి, కడుపులో గ్యాస్, మంట, హై బీపీ, హై కొలస్ట్రాల్, గుండె సమస్యలు, లివర్ వ్యాధులు, కిడ్నీలో రాళ్లు, డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదముంది. అధిక బరువు, పొట్ట వల్ల ఆరోగ్య శారీరక సమస్యలే కాదు, ఆత్మన్యూనత భావం కూడా పెరుగుతుంది. మానసికంగా కుంగిపోతారు. ఇతరులతో పోల్చుకొని తాము బాగా లేమని మధనపడేవారు ఎందరో. ఇక బరువు తగ్గాలంటే తగిన వ్యాయామంతో పాటు మంచి డైట్ ఫాలో కావాలన్న సంగతి మనకు తెలిసిందే. అయితే వ్యాయామంతోనే అసలు చిక్కంతా. కొందరికి అది చేయాలంటే సమయం ఉండదు. ఇలాంటి వారు కఠినమైన డైట్ నియమాలు పాటించి తాము అనుకున్నది సాధించుకోవచ్చు. అవేమిటో మరి చూద్దాం పదండి....1. ఇవి ఆహారంలో భాగం చేసుకోండి... 1. ఇవి ఆహారంలో భాగం చేసుకోండి...తొందరగా బాన పొట్టను తగ్గించుకోవాలంటే అదీ ఎలాంటి వ్యాయామం లేకుండా చేయాలంటే ముందు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. లో ఫ్యాట్ డైట్ ను ఆహారంలో భాగం చేసుకోవాలి. గ్రీక్ యోగర్ట్ ను తీసుకుంటే కడుపులో ఆరోగ్యకర బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. తద్వారా పొట్ట కొంచెం కొంచెంగా తగ్గుతుంది. కొవ్వు కణాలు వేగంగా కాలిపోయి కడుపు ఫ్లాట్ గా మారిపోవడాన్ని మీరే గమనించవచ్చు. 2. ఉప్పు తగ్గించండి... 2. ఉప్పు తగ్గించండి...కూరల్లో చిటికెడు ఉప్పు వేస్తే ఆ రుచే వేరు. ఆ ఉప్పు లేకపోతే ఎన్ని దినుసులు వేసినా వంటకానికి రుచే రాదు. ఐతే పొట్ట తగ్గించుకోవాలంటే కాస్త ఉప్పు చూసి వేసుకోవాలి సుమా! వీలైనంత తక్కువ ఉప్పు తీసుకునేలా జాగ్రత్త పడండి. ఉప్పు నీటిని పట్టి ఉంచుతుంది కాబట్టి పొట్ట దగ్గర కొవ్వు అలాగే నిల్వ ఉండిపోతుంది. 3. చూయింగ్ గమ్ నములుతున్నారా... 3. చూయింగ్ గమ్ నములుతున్నారా...ఒక్కోసారి చిన్న చిన్న పనులు కూడా పెద్ద ప్రభావాన్ని చూపిస్తాయి. చూయింగ్ గమ్ నమలడం లాంటివి ఇలాంటి కోవలోకి వస్తాయి. చూయింగ్ గమ్ లో ఉండే చక్కెర వల్ల లేదా అందులో ఉపయోగించే కృత్రిమ చక్కెర వల్ల తొందరగా ఆరోగ్యం పాడవుతుంది. అదీకా క బాన పొట్ట



అలాగే మిగిలిపోతుంది. చూయింగ్ గమ్ తినాలనుకున్నప్పుడు ఈ సారి ఏ నట్స్ లేదా లవంగమో, ఇలాచీనో నోట్లో వేసుకోండి. 4. మద్యం వద్దు 4. మద్యం వద్దుబీర్ బెల్లీ .. ఆ పేరు రావడానికి ఒక కారణం ఉంది. బీర్ తాగితే పొట్ట అంటే బెల్లీ పెరుగుతుందని అర్థం. అందుకే మద్యం సేవించడాన్ని మొత్తానికి మానేస్తే పొట్ట తగ్గుదలలో గణనీయమైన మార్పును గమనించవచ్చు. అదీ కాకుండా మద్యం మానేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకున్నవాళ్ల మవుతాం. 5. హార్మోన్ల ప్రభావం 5. హార్మోన్ల ప్రభావంఒక్కోసారి కొందరు ఎన్ని ఆరోగ్య సూత్రాలు పాటించినా, మంచి డైట్ ఫాలో అయినా ఎంతకీ బెల్లీ ఫ్యాట్ తగ్గదు సరికదా పెరుగుతూ ఉంటుంది. ఇక ఇలాంటివారు ఏం చేయాలంటే తమ హార్మోన్లను టెస్ట్ చేయించుకోవాలి. డాక్టర్ చెప్పిన సలహా పాటించి ట్రీట్‌మెంట్ తీసుకుంటే పొట్ట తగ్గే అవకాశాలు పెరుగుతాయి. 6. ఈ కూరగాయలు వద్దు 6. ఈ కూరగాయలు వద్దుకొన్ని పరిశోధనల్లో తేలిందేమిటంటే క్యాబేజీ, కాలిఫ్లవర్, బ్రకోలి లాంటి కూరగాయలు నడుము చుట్టు కొవ్వును పెంపొందిస్తాయని తెలిసింది. ఇందులో రఫినోస్ అనే పదార్థం మూలంగా కొవ్వు పెరుగుతుందని అంటారు. ఇదే కడుపులో గ్యాస్, మంటకు కూడా దారితీయవచ్చు. అందుకే వీటి వినియోగాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించాలి. 7. మలబద్ధకమా..? 7. మలబద్ధకమా..?తరచు బాత్‌రూమ్‌కు వెళ్లేవాళ్లలో మీరు ఒకరా.. మా ఉద్దేశం మలబద్ధకం ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. వీరు వీలైనంత తొందరగా మలబద్ధకాన్ని వదిలించుకోవాలి. లేదా పొట్టచుట్టు కొవ్వు మరింత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి సరైన సమయంలో వైద్యుడి చికిత్స తీసుకోవాలి.

# అదేపనిగా గంటల తరబడి ఒకే చోట కూర్చుని పని చేస్తున్నారా? ఈ 15 దుష్ప్రభావాలు కాచుకుని ఉన్నాయి జాగ్రత్త.

ఎక్కువసేపు కూర్చొని పనిచేయడం మీ జీవిత కాలాన్ని తగ్గిస్తుందని తెలుసా? దీర్ఘకాలం పాటు కూర్చుని పనులు చేసే వ్యక్తులు గుండెజబ్బుతో మరణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అనేక పరిశోధనలు ద్వారా తేలిన నిజం. నిరంతరం పనివద్ద కూర్చోవడం కూడా అనేక దుష్ప్రభావాలకు దారితీస్తుంది. శారీరిక ఆరోగ్యాన్నే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా దెబ్బ తీస్తుంది. ఇటువంటి కుర్చీకి అంటుకుపోయే ఉద్యోగాల్లో చిక్కుకున్న వ్యక్తులు నిర్దిష్టరకానికి చెందిన పెద్దప్రేగు కాన్సర్ ప్రమాదాన్ని రెండింతలు ఎక్కువగా కలిగే అవకాశం ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఒక్కసారి దుష్ప్రభావాలు తలెత్తి పరిస్థితి చేయిదాటితే, వ్యాయామాలు, ఆహార ప్రణాళికలలో మార్పులు కూడా వంటివి కూడా పెద్దగా సహాయపడకపోవచ్చు. నిరంతరం కుర్చీకి అతుక్కుపోయి పనిచేయడం వలన 24 దీర్ఘకాలిక వ్యాధులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. వీటిలో ముఖ్యమైన 15 ఆరోగ్య సమస్యల గురించిన వివరాలు ఇక్కడ పొందుపరచబడ్డాయి. అధిక కొలెస్ట్రాల్ : ఒక సంవత్సరం అదేపనిగా కూర్చుని పనిచేసే ఉద్యోగంలో ఉన్నారా? అయితే, మీరు నెమ్మదిగా అధిక కొలెస్ట్రాల్ సమస్యను అనుభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎక్కువ గంటలు కూర్చొని ఉన్న ఎడల శరీరంలోని కొలెస్ట్రాల్ హెచ్చుతగ్గులలో అసమతుల్యత ఏర్పడుతుంది. క్రమంగా శరీరంలోని జీవక్రియలు తగ్గుముఖం పట్టి, ప్లాస్మాట్రైగ్లిజరైడ్ స్థాయిలు అధికమవడం, అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ కొలెస్టరాల్ స్థాయిలు తగ్గిపోవడం, అదే సమయంలో ఇన్సులిన్ హెచ్చుతగ్గులలో అసమతౌల్యం వంటి సమస్యల వలన అనేక రుగ్మతల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఊబకాయం: పొగాకు వలె, ఎక్కువసేపు కూర్చొని పని చేయడం కూడా ఆరోగ్యానికి హానికరంగా పరిగణించబడుతుంది. పనిలో అదేపనిగా కుర్చీలకు అతుక్కుపోవడం వలన, కండరాలకు సరైన వ్యాయామం, కదలిక లేక మరియు పూర్తిగా ఉపయోగించబడని కారణంగా కాలరీ బర్నింగ్ తగ్గుదలకు గురవుతుంది. తద్వారా పొట్టచుట్టూ కొవ్వు చేరడమే కాకుండా, శరీరంలో అవాంఛనీయ కొవ్వుల శాతం పెరుగుదల అధికమవుతుంది. తద్వారా శరీరం ఊబకాయానికి గురవుతుంది. గుండెవ్యాధి: కండరాలు శరీరంలోని కొవ్వులో తక్కువ శాతాన్ని మాత్రమే దహించగలవు మరియు దీర్ఘకాలం కూర్చొని ఉండటం మూలాన రక్తప్రవాహం కూడా నెమ్మదిగా మందగిస్తుంది. ముఖ్యంగా ధమనులలో కొవ్వు పదార్థాలు పేరుకుని పోవడం మూలంగా,



రక్తప్రసరణలో అనిశ్చితి నెలకొంటుంది. క్రమంగా, నిశ్చల జీవనశైలి కలిగిన వ్యక్తులు గుండె వ్యాధులకు ఎక్కువగా గురవుతూ ఉంటారు. క్యాన్సర్: తక్కువ శారీరక శ్రమ, నిద్రాణ స్థితుల కారణంగా, గుండె జబ్బు మరియు క్యాన్సర్ ముప్పు వాటిల్లే ప్రమాదం అధికంగా ఉంది. రోజంతా డెస్క్ వద్ద కూర్చొని చేసే పనుల కారణంగా, కార్పస్ యుటేరి(గర్భాశయ కాన్సర్), రొమ్ము కాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి అనేక కాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని తేలింది. మధుమేహం: డెస్క్ వద్ద నిరంతరంగా కూర్చుని చేసే పనుల కారణంగా జీవక్రియలు మందగించడం, క్రమంగా రక్తంలోని చక్కర స్థాయిల హెచ్చుతగ్గులలో అసమతుల్యత ఏర్పడడం మూలంగా మధుమేహం వస్తుంది. రక్తం నుండి చక్కెరలను కణజాలాలకి తీసుకుని వెళ్లేందుకు, ఎక్కువగా బాధ్యత వహించే హార్మోన్ ఇన్సులిన్. జీవక్రియలు మందగించడం వలన క్లోమగ్రంథిపై ప్రభావం పడుతుంది. తద్వారా ఇన్సులిన్ స్థాయిలలో అసాధారణ మార్పులు చోటుచేసుకోవడం మూలంగా, రక్తంలోని గ్లూకోజ్ హెచ్చుతగ్గులను నియంత్రించలేని స్థితికి శరీరం వస్తుంది. ముఖ్యంగా టైప్-2 మధుమేహం కలిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మెదడు పనితీరు మందగించుట: కండరాలు, తాజా రక్తం మరియు ప్రాణవాయువును మెదడు ద్వారా పంపుతూ అన్నిరకాల మానసిక స్థితులను మెరుగుపరచే సెరటోనిన్ వంటి హాపీహార్మోన్స్ విడుదలయ్యేందుకు సహాయపడుతుంది.

# ఈ 8 అద్భుతమైన డ్రింక్స్/జ్యూస్ లను తాగి వాపులు,నొప్పులతో పోరాడండి

మీకు వాపులు సహజమైన ప్రక్రియ, శరీరానికి మంచివి అని ఎవరైనా చెప్పారా? చాలామటుకు అది నిజమే. శరీరానికి హానికారక జీవుల నుంచి కాపాడుకునే సహజ రోగనిరోధక పరిస్థితి ఇది. కానీ కొన్నిసార్లు వాపులు మరీ ఎక్కువైపోయి,చాలారోజులుండి, తగ్గవు కూడా. అప్పుడు శరీరానికి 'మంచి' కన్నా 'చెడే' ఎక్కువ జరుగుతుంది. మీరెప్పుడైనా మీ వంటికి ఎక్కడైనా గాయం తగలగానే ఎందుకు కొన్ని శరీరభాగాలు వాచిపోతాయని ఆలోచించారా?ఇది ఎందుకంటే ప్రతి గాయం మన కణజాలాలను పాడుచేసి, వాపు ప్రక్రియ జరిగిన తర్వాతనే నయం అయి మామూలు స్థితికి చేరతాయి. ఇలా చూస్తే వాపు ప్రక్రియ అనేది సహజ రోగనిరోధక మెకానిజం అని, దీని మధ్యలో కల్పించుకోకూడదని అనుకోవచ్చు. కదా? పూర్తిగా కాదు. ఎక్కువకాలం ఉంటూ, నొప్పితో కూడిన వాపులు నార్మల్ కాదు, ఇవి మీ శరీరాన్ని ఈ కాలపు సాధారణ వ్యాధులైన- కాన్సర్, డిఎన్ ఎ పాడవటం, గుండెజబ్బులు, రక్తపోటు, డయాబెటిస్, ఆర్థరైటిస్ వంటివి వచ్చే రిస్కుల్లో పడేస్తుంది. మీ జీవనవిధానాన్ని మార్చుకుని, శరీరాన్ని సహజంగా డీటాక్స్ అయ్యేలా చేయటం వలన అనారోగ్యకరమైన వాపులు నెమ్మదిగా తగ్గేట్లా చేయవచ్చు. ఇక్కడ వాపుతో పోరాడి,శరీరానికి చాలా లాభాలు చేకూరుస్తూ, మీ జీవితం మళ్ళీ సాధారణమయ్యేలా సాయపడే 8 డ్రింక్స్/ స్మూతీల గురించి ఇవ్వడం జరిగింది. ఇంకా మంచి విషయం ఏంటంటే ఇందులో వాడిన అన్ని పదార్థాలు ఇంట్లోనే ఉంటాయి లేదా సులభంగా దొరుకుతాయి! 1.నిమ్మ,పసుపు పసుపులో కర్క్యూమిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది, దీనికి వాపు వ్యతిరేక లక్షణాలు కూడా ఉండి, కీళ్ల నొప్పులు తగ్గించటంలో సాయపడుతుంది.నిమ్మకాయలో విటమిన్ సి ,సిట్రిక్ యాసిడ్ ఉంటాయి, ఇవి శరీరానికి చాలా లాభం చేస్తాయి. ఈ రెండూ కలిస్తే వాపు వ్యతిరేక పదార్థాల ుగా, శరీరంలో డీటాక్స్,హైడ్రేషన్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. ఒక పెనంలో, 1 చెంచా తురిమిన అల్లం, పసుపులను ఒక పూర్తి నిమ్మకాయ రసం పిండి(తొక్కతో సహా),3 కప్పుల నీళ్ళతో మీడియం మంటపై వెచ్చబెట్టండి. మరిగించవద్దు. ఈ టానిక్ ను రోజూ వాపులను తగ్గించుకోవటం కోసం తాగండి, మిగిలిన దాన్ని ఫ్రిజ్ లో దాచవచ్చు. మీకు స్వీట్లంటే ప్రాణమైతే, కొంచెం తేనె కూడా కలుపుకోవచ్చు! మీ వల్ల కాదనిపిస్తోందా?ప్రత్యామ్నాయంగా సింపుల్ గా పసుపు టీ లేదా నిమ్మరసాన్ని మీకు నచ్చిన రుచితో తీసుకోవచ్చు. ఆఫ్రికాలోని 2500ఏళ్ళనాటి బయోబాబ్ చెట్లు అకస్మాత్తుగా ఎందుకు అంతరించే దశకు చేరుకుంటున్నాయి? క్యాన్సర్ ని అరికట్టే రెడ్ వైన్ తమకు వడ్డించే స్త్రీ వివస్త్ర అయ్యి ఉండాలని త్రిమూర్తులన్నప్పుడు సతీ అనసూయ ఏం చేసిందో తెలుసా? 2.అల్లం,పార్స్లీ అల్లం,పార్స్లీలలో జింజెరోల్,కార్నోసోల్ అనే వాపు వ్యతిరేక ఏజెంట్లు ఉంటాయి. ఇవి కండరాల నొప్పులను తగ్గించి జీర్ణక్రియలో సాయపడతాయి. అంతేకాక, అల్లం వాపును కలిగించే ప్రోస్టాగ్లాండిన్,ల్యూకోట్రియిన్ ఉత్పత్తిని కూడా నివారిస్తుంది. ఈ రసం తయారుచేయటానికి చేతికి పట్టినన్ని పార్స్లీ రెబ్బలను, 2 అంగుళాల అల్లం, ఒక నిమ్మకాయ, ఒక చిన్న దోసకాయ, కొన్ని పాలకూర ఆకులు, ఒక గ్రీన్ యాపిల్, కొన్ని కొత్తిమీర రెబ్బలతో కలపండి. మీరు దీన్ని రెండు లేదా మూడు నెలలపాటు రోజుకి ఒకసారి తాగి చూడండి, తేడా మీకే తెలుస్తుంది! 3.బీట్ జ్యూస్ లేదా స్మూతీ ఈ ఆర్టికల్ లో వస్తున్న ఎరుపు, పసుపులను చూసి భయపడకండి ; ఈ ఎరుపు,పసుపు పదార్థాలు ఎంత ముఖ్యమో, లాభదాయకమో మీకు తెలీదు! బీట్ రూట్ లో విటమిన్ సి, పొటాషియం, ఐరన్, మాంగనీస్, విటమిన్ బి9,పీచు మొదలైనవి ఉంటాయి.ఇవి ఆక్సిజన్ పీల్చుకోవటం ఎక్కువచేసి, రక్తపోటును, వాపులను తగ్గిస్తాయి. ఈ డ్రింక్ కి మరింత రుచి,పోషకాలను పెంచాలంటే చిన్న/మధ్యమంగా ఉండే బీట్ రూట్ ను 1 చెంచా పసుపుతో, అరచెంచా అల్లం(మీ రుచిని బట్టి)తో, ఆరెంజ్, చేతిలో పట్టినన్ని స్ట్రాబెర్రీలు,రెండు లేదా ఎక్కువ కప్పుల కొబ్బరినీళ్లతో కలిపితే రుచికరమైన స్మూతీ తయారవుతుంది! 4. క్యారట్ జ్యూస్ లేదా స్మూతీ ఈ చిన్ని ఆరెంజ్ రంగు పదార్థాలలో కళ్ళకి, చర్మానికి ముఖ్యమైన చాలా విటమిన్ ఎ ఉంటుంది. శుభవార్త ఏంటంటే ఇవి వాపులతో కూడా పోరాడుతాయి! 8 నుంచి 10 క్యారట్ల రసం తీయండి, తొక్కతీసిన ఆరెంజి,ఆపిల్, అరచెక్క నిమ్మకాయ,అల్లం, నచ్చితే పసుపు, 1 చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ తో కలపండి.మీకు నచ్చుడాన్ని బట్టి నీళ్ళు, లేదా పాలని ఈ మిశ్రమానికి కలుపుకోవచ్చు. 5.చికెన్ ఎముకల సూప్ కేవలం చికెన్ మాత్రమే ఎందుకు,మిగతావి ఎందుకు కావు?ఎందుకంటే చికెన్ ఎముకలో కోన్డ్రోటిన్ సల్ఫేట్,గ్లూకోసమైన్ ఉంటాయి.

# భోజనం చేసాక టీ తాగవచ్చా? తాగరాదా?



భోజనం చేసాక టీ తాగడమనేది, ఒక వివాదంతో కూడుకున్న అంశం. అధ్యయనాల ప్రకారం టీ తాగితే జీర్ణవ్యవస్థకు మేలు జరుగుతుందని చెప్తారు, అదే సమయంలో, అందులోని కెఫిన్ పోషకాలను మన శరీరం గ్రహించకుండా చేస్తుందని అంటారు. జీర్ణవ్యవస్థ పనితీరుపై టీ ప్రభావం: అధ్యయనాల ప్రకారం , భజనం తరువాత టీ తాగితే, కడుపులోని అపాన వాయువులు మరియు ఉబ్బరం నుండి ఉపశమనం లభిస్తుంది. కానీ, అన్ని రకాల టీలు ఒకే రకమైన ప్రభావం చూపవు. హెర్బల్ టీ లేదా గ్రీన్ టీలో అధిక మొత్తంలో పాలీఫీనాల్స్ మరియు యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వలన.అవి జీర్ణానికి తోడ్పడతాయి. ఈ టీలు పైత్యరసం, లాలాజలం మరియు జీర్ణరసాల స్రావాన్ని ప్రేరేపించి, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి.దీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. కెటచిన్స్ వంటి పాలీఫీనాల్ సమ్మేళనాలు, పెప్సిన్ వంటి జీర్ణ ఎంజైములు పనితీరును ప్రోత్సహించడం వలన ప్రోటీన్ల అరుగుదల మెరుగవుతుంది. భోజనంతో పాటు టీ తాగడం ఎందుకు మంచిది కాదో తెలిపే కొన్ని కారణాలు: అధ్యయనాల ప్రకారం, టీలో ఉండే ఫీనాలిక్ సమ్మేళనాలు, ఐరన్ సోషణను అడ్డుకుంటాయి ఎందుకనగా ఇవి ఐరన్ తో చర్య జరిపి సముదాయాలను ఏర్పాటు చేస్తాయి. మీరు భోజనం చేసాక కనుక టీ తాగలనుకున్నట్లైతే, విటమిన్ సి మరియు ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలని సిఫార్సు చేయబడింది. భోజనం చేసాక టీ తాగితే, శరీరంలో కెటచిన్స్ లభ్యత తగ్గిపోతుంది. ఆహార మార్గదర్శకాల కమిటీ కన్వీనర్, డాక్టర్ డి రఘునాథరావు, టైమ్స్ ఆఫ్ ఇండియాకు "ఏదైనా తిన్న, కనీసం ఒక గంట ముందు మరియు తరువాత సేవించరాదు, ఎందుకంటే, వీటిలో ఉండే టానిన్లు ఐరన్ సోషణను అడ్డుకుంటాయి" అని తెలియజేసారు. కాఫీ మరియు టీలను సేవించడం వలన కండరాల నొప్పి, అలసట తగ్గినప్పటికీ, వాటిని తక్కువగా తీసుకోవాలి. ఈ 8 అద్భుతమైన డ్రింక్స్ /జ్యూస్ లను తాగి వాపులు,నొప్పులతో పోరాడండి జ్యోతిష్య శాస్త్రం ప్రకారం మీరు పెళ్లికి సిద్ధమవడానికి సరైన సమయం ఇదే..! ను డీల్ చేయడమెలా? ఆహార మార్గదర్శకాల అనుసారం హృద్రోగాలతో బాధపడేవారు కాఫీ సేవనాన్ని తగ్గించుకోవాలి, ఎందుకనగా, ఇది రక్తపోటును పెంచి గుండె పనితీరును కుంటుపరుస్తుంది.

# ప్రతిరోజూ అల్లం టీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు తయారీ విధానం

ఆయుర్వేదంలో అల్లంను సర్వరోగ నివారిణిగా భావిస్తారు. అల్లంలో ప్రతి అంశం శ్రేష్ఠమైనదే మరియు దీనిని అనాదిగా సాంప్రదాయ మరియు పశ్చిమ వైద్య విధానాలలో ఉపయోగిస్తున్నారు. అల్లం అనేక శక్తివంతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. అల్లంలో ఉండే జింజెరాల్ మరియు షోగోల్ అనే ఘాటైన దానికి అంతటి మహత్తుకు కారణమని పరిశోధకులు తెలియజేసారు. అల్లం టీ అధిక స్థాయిలో విటమిన్ సి, అమైనో ఆమ్లాలు మరియు కొద్దీ మాత్రంలో కాల్షియం, జింక్, ఫాస్ఫరస్, మొదలైన ఖనిజాలను కలిగి ఉంటుంది. అల్లం టీ త్రాగితే, శరీరానికి పలు ప్రయోజనాలు కలుగుతాయి. జీర్ణ సమస్యలకు చికిత్సలో దీనిని ఉత్తమంగా భావిస్తారు. అల్లం టీ నెమ్మదించిన జీర్ణక్రియను కూడా ప్రేరేపిస్తుంది మరియు రుచి చూడటాన్ని కోల్పోయిన రుచి మొగ్గలను సాధారణ స్థితికి తీసుకువస్తుంది. ఈ వ్యాసంలో అల్లం టీ యొక్క ఆరోగ్య ప్రయోజనాల్లో కొన్నింటిని తెలియజేస్తున్నాము. అల్లం టీ ప్రతిరోజు త్రాగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకోవడానికి ఆలస్యం చేయకుండా చదవండి. 1. యాంటీ క్యాన్సర్ లక్షణాలు: క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించే శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ ఔషధంగా అల్లంను భావిస్తారు. అల్లం ప్యాంక్రియాటిక్, కొలొరెక్టల్, ప్రోస్టేట్, మూత్రాశయం, కాలేయం మరియు రొమ్ము క్యాన్సర్ యొక్క వ్యాప్తినిని నిరోధిస్తుంది. ఇది అల్లం టీ యొక్క ముఖ్య ఆరోగ్య ప్రయోజనాలలో ఒకటి. 2. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: అల్లంలో ఉండే జింజెరాల్ మరియు షోగోల్ ,జీర్ణక్రియను ప్రేరేపించి పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది. ఇది అనేక జీర్ణ సమస్యలను తొలగిస్తుంది. అందువల్ల అల్లం టీ,జీర్ణసమస్యల నివారణకు ఉత్తమంగా భావించబడుతుంది 3. రక్తప్రసరణను ప్రోత్సహిస్తుంది: అల్లం రక్తప్రసరణను ప్రోత్సహించడం ద్వారా,అధిక రక్తపోటు మరియు కొలెస్ట్రాల్ వంటి కార్డియోవాస్కులర్ వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడడంలో సహాయపడుతుంది. అల్లం కూడా ధమనులు నుండి అడ్డులను తొలగించడంలో సహాయపడుతుంది కనుక గుండెపోటు మరియు స్ట్రోక్ ప్రమాదాలు తగ్గుతాయి. 4. మెదడు శక్తిని పెంచుతుంది : ప్రతిరోజూ అల్లం టీ సేవిస్తే, అభిజ్ఞ సామర్థ్యాలు మరియు జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. కనుక, ఇది , మన శరీరం లో ఆక్సీకరణ ఒత్తిడి, అపోప్టోసిస్ మరియు వాపు తగ్గిస్తుంది. నడివయసు స్త్రీలలో మతిమరుపు తగ్గిస్తుంది. 5. ఇన్ఫ్లమేటరీ ఏజెంట్ : అల్లం ఒక యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్ లా పనిచేసి, వాపు వలన కలిగే కీళ్ళ మరియు కండరాల నొప్పికి నివారణకు దోహదం చేస్తుంది. ప్రతిరోజూ అల్లం టీ తాగడం వలన కలిగే కొన్ని ముఖ్య ఆరోగ్య ప్రయోజనాలలో ఇది కూడా ఒకటి. 6. రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది: అల్లం టీని క్రమం తప్పకుండా తీసుకోవడం వలన రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుతుంది. మన శరీరానికి సోకే ఏరకమైన వ్యాధిని అయినా, నివారించడంలో కూడా సహాయపడుతుంది. అల్లం టీ తయారీ విధానం మీ కోసం: కావల్సినవి: 4-6 సన్నగా తరిగిన అల్లం ముక్కలు తేనె, తగినంత ఒక గ్లాసుడు నీరు తయారీ: నీటిని ఒక గిన్నెలో పోసి వేడి చేయండి. దీనికి అల్లం కలిపి చిన్నసెగపై పది నిమిషాలు మరగనివ్వండి. తరువాత దీనిని వడగట్టి, గ్లాసులో పోయండి. చల్లారాక తేనె కలపండి. ఇది అల్లం టీ చేసుకునే విధానం.



# జీవిత బీమా పాలసీని సరెండర్ చేయాలా? అమ్మేయాలా?.. ఏది చేస్తే లాభం?





ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్నవారు, అధిక మొత్తాల్లో ఉన్న ప్రీమియంలు చెల్లించలేకపోతున్న వారు, పాలసీ అనవసరంగా భావించినవారు.. తమ జీవిత బీమా పాలసీలను సరెండర్ చేస్తుంటారు. మరికొందరు అమ్ముతూ ఉంటారు. అయితే ఈ రెండింటిలో ఏది లాభం? నిపుణులు ఏం చెప్తున్నారు. మీ జీవిత బీమా పాలసీని సరెండర్ చేయడం కన్నా.. అమ్ముకుంటే ఎక్కువ మొత్తంలో నగదును పొందగలరని నిపుణులు సూచిస్తున్నారు. పాలసీని సరెండర్ చేయడం అంటే మీ కవరేజీని రద్దు చేసుకోవడమే. మీ పాలసీ పత్రాలను తిరిగి సదరు కంపెనీకే ఇచ్చేయాల్సి ఉంటుంది. ఇందుకుగాను మీకు ఆ బీమా పాలసీని అమ్మిన సంస్థ.. వెంటనే దాని సరెండర్ విలువను చెల్లిస్తుంది. సంస్థ నిర్ణయించినదే వస్తుంది. ఎలాంటి సంప్రదింపులకు ఆస్కారం లేదు. ఈ క్రమంలో ఏవైనా చార్జీలు పడితే వాటిని ఆ మొత్తం నుంచి మినహాయించుకుంటుంది కూడా. దీంతో మీకు తక్కువ నగదు మొత్తాలు రావచ్చు. మీకు అనవసరంగా అనిపించిన లేదా మీరు భారంగా భావించిన మీ పాలసీని సరెండర్ చేయకుండా సెకండరీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి కూడా వీలున్నది. దీన్ని లైఫ్ ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌గా పిలుస్తారు. సరెండర్ చేస్తే మీకు త్వరితగతిన మీరు చెల్లించిన నగదు తిరిగి రావచ్చుగానీ.. అమ్ముకుంటే మాత్రం ఎక్కువ మొత్తంలో నగదును పొందే అవకాశం ఉంటుంది. ఇక అమ్ముకుంటే మీ పాలసీ ప్రీమియంలన్నీ కూడా దాన్ని కొన్నవారే చెల్లిస్తారు. అలాగే మీరు చనిపోయినప్పుడు మీ మరణానంతర ప్రయోజనాలన్నీ కూడా పాలసీని కొన్నవారికే అందుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పాలసీ యాజమాన్య హక్కులను మీరు అమ్ముకుంటున్నారన్నమాట. సెకండరీ మార్కెట్‌లో జీవిత బీమా పాలసీల్లో తమ నగదును పెట్టుబడిగా పెట్టే ప్రైవేట్ ఇన్వెస్టర్లు కొంటారు. అలాగే ప్రైవేట్ సెల్లర్ల నుంచి జీవిత బీమా పాలసీలను కొనే లైఫ్ సెటిల్మెంట్ కంపెనీలుంటాయి. బ్రోకర్ల ద్వారా ఈ లావాదేవీలు జరుగుతాయి. ఇక బ్యాంకులు లేదా క్రెడిట్ యూనియన్ల వంటి ఇతర ఆర్థిక సంస్థలూ కొంటాయి. కాగా, వయస్సు, ఆరోగ్య పరిస్థితులనుబట్టి కూడా పాలసీలకు సెకండరీ మార్కెట్‌లో ధరలు పలుకుతాయి. అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుంటే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువ కాబట్టి అధిక మొత్తాల్లో చెల్లించి పాలసీలను కొనేందుకు బయ్యర్లు ముందుకొస్తారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. అలాగే తక్కువ మొత్తాల ప్రీమియంలతో కూడిన పాలసీలున్నా.. ఆకర్షణీయ ధర లభిస్తుంది. పాలసీకున్న మరణానంతర ప్రయోజనాలనుబట్టి కూడా ధరలు పెరుగుతాయి. పాలసీ సెల్లర్లు సంప్రదింపుల ద్వారా కూడా తమ పాలసీ ధరల్ని పెంచుకోవచ్చు. పాలసీని సరెండర్ చేయడమో లేదా అమ్ముకోవడమో అనేది పాలసీదారులకు చిట్టచివరి మార్గంగా మాత్రమే ఉండాలి. ప్రతీ చిన్న అవసరం కోసం జీవిత బీమా పాలసీలను వదులుకోరాదు. అలాగే ఆర్థిక సలహాదారులను సంప్రదిస్తే మరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలనైనా వారు సూచించగలరు. అలా నిధుల అవసరాలను తీర్చుకోవచ్చేమోనని కూడా ప్రయత్నిస్తే మంచిది. దీనివల్ల కుటుంబానికి మేలు చేసినవారు అవుతారు. మీరు లేని సమయంలో మీ వాళ్లకు భరోసా ఒక్క బీమా మాత్రమేనన్నది మరువద్దు.

# ఒకవైపు అమ్మకాలు మరోవైపు లాభాలు



న్యూఢిల్లీ, జూన్ 24 : ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్న కేంద్ర సర్కార్‌కు ఆయా సంస్థల షేర్లు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటంతో మింగుడుపడటం లేదు. నరేంద్ర మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సంస్థను వదలడం లేదు. ఏకంగా రికార్డు స్థాయి లాభాలను ఆర్జించిన సంస్థలను సైతం అమ్మకానికి పెట్టారు. ఎల్ఐసీతోపాటు ఏ సంస్థలో వాటాను బహిరంగ మార్కెట్లో అమ్మేశారు. మరోవైపు, ఈ సంస్థల షేర్లు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. నరేంద్ర మోదీ సర్కార్ మూడోసారి అధికారం చేపట్టిననాటి నుంచి ఆయా సంస్థల షేర్లు భారీగా లాభపడ్డాయి. ముఖ్యంగా గత 10 రోజుల్లో పీఎస్‌యూల షేర్లు రూ.7 లక్షల కోట్ల మేర పెరగడం విశేషం. పీఎస్‌యూలను తెగనమ్మేస్తామని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేసినప్పటికీ ఆయా షేర్లు మాత్రం మదుపరులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెడితే భవిష్యత్తులో అధిక రాబడి వచ్చే అవకాశం ఉంటుందన్న అంచనాతో దేశీయ, విదేశీ మదుపరులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని మార్కెట్ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వీటికితోడు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పీఎస్‌యూలు అంచనాలకుమించి రాణించడం కూడా మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా దేశీయ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రికార్డు స్థాయి లాభాలను ఆర్జించడంతోపాటు భారత్ పెట్రోలియం కార్పొరేషన్, కోల్ ఇండియాలు కూడా లాభాలు అత్యధికంగా నమోదయ్యాయి. ఆయా సంస్థల షేర్లు రాణించడంతో సంస్థల మార్కెట్ విలువ రెట్టింపుస్థాయిలో పెరిగింది. సంస్కరణలు కొనసాగుతుండటం, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా ఈ సూచీలు రాణిస్తున్నాయి. అలాగే అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు కూడా ఆశావాదంగా కదులుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అధికంగా నిధులు కుమ్మరించడం కూడా కలిసొస్తున్నది. కానీ, పలువురు మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం దూసుకుపోతున్న పీఎస్‌యూల స్టాక్‌లు ఎప్పుడైనా పేలే అవకాశాలున్నాయని అంటున్నారు. మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావచ్చని, అప్పుడూ ఆయా సూచీలు కుప్పకూలే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. గడిచిన పదేండ్లలో ప్రభుత్వరంగ సంస్థ ల్లో వాటాల విక్రయం ద్వారా మోదీ సర్కార్ సేకరించింది అక్షరాల రూ.4.20 లక్షల కోట్లు. వీటిలో రూ.3.15 లక్షల కోట్లు మైనార్టీ వాటాను విక్రయించడంతో సమకూరగా, మరో రూ.69,412 కోట్లు మాత్రం పది ప్రభుత్వరంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటాను విక్రయించడంతో లభించాయి. వీటిలో హెచ్‌పీసీఎల్, ఆర్ఈసీ, డీసీఐఎల్, హెచ్ఎస్‌సీసీ, ఎన్‌పీసీసీ, నెప్కో, టీహెచ్‌డీసీ, కామరాజర్ పోర్ట్, ఎయిర్ ఇండియా, ఎన్ఐఎన్ఎల్‌లు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన మొదట్లో వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులను తరలించుకుపోయిన ఎఫ్‌పీఐ.. స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకావడంతో మళ్లీ పెట్టుబడుల వైపు మళ్లారు. ఈ నెల 10 నుంచి ఇప్పటి వరకు జరిగిన పది ఈక్విటీ ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్‌పీఐలు ఏకంగా రూ.23,786 కోట్ల నిధులు కుమ్మరించారు. ఎఫ్‌పీఐలు పెట్టుబడులు పెట్టడానికి ప్రధానంగా మూడు కారణాలని, స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకావడంతో సంస్కరణలు కొనసాగే అవకాశం ఉండటం, చైనా ఆర్థిక వ్యవస్థ పరుగు నెమ్మదించడం, ముఖ్యంగా గడిచిన నెలరోజుల్లోనే రాగి ధరలు 12 శాతం తగ్గడం కూడా ఇందుకు కారణమని మోజోపీఎంఎస్ చీఫ్ ఇన్వెస్ట్మెంట్ అధికారి సునీల్ దమానియా తెలిపారు. అలాగే ఈక్విటీ మార్కెట్లో బ్లాక్ ఒప్పందాలు అధికంగా ఉండటం కూడా ఎఫ్‌పీఐల్లో జోష్ పెంచింది. జూన్ నెల వరకు ఎఫ్‌పీఐలు రూ.11,193 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

# మధ్యతరగతి ప్రజలకు కేంద్రం గుడ్ న్యూస్.. ఆదాయపు పన్ను తగ్గించే అవకాశం




కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడంతో రాబోయే బడ్జెట్‌లో ఏయే కొత్త పథకాలతో పాటు ఏవైనా తగ్గింపులను ప్రకటిస్తారేమోనని అందరూ ఎదురుచూస్తున్నారు. రాబోయే బడ్జెట్ 2024లో తక్కువ-ఆదాయ వ్యక్తులకు గణనీయమైన పన్ను తగ్గింపులను ప్రభుత్వం పరిశీలిస్తోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీల ప్రమాణ స్వీకారం పార్లమెంట్ హాల్లో ఘనంగా జరుగుతుంది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం 2024 సంవత్సారానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడంతో రాబోయే బడ్జెట్‌లో ఏయే కొత్త పథకాలతో పాటు ఏవైనా తగ్గింపులను ప్రకటిస్తారేమోనని అందరూ ఎదురుచూస్తున్నారు. రాబోయే బడ్జెట్ 2024లో తక్కువ-ఆదాయ వ్యక్తులకు గణనీయమైన పన్ను తగ్గింపులను ప్రభుత్వం పరిశీలిస్తోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇదే జరిగితే గడిచిన ఏడేళ్లలో ఆదాయపు పన్ను ఉపశమానానికి సంబంధించి కేంద్రం తీసుకునే మొదటి నిర్ణయం అవుతుందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్ 2024లో సాధారణ పౌరులకు ఎలాంటి తగ్గింపులను అందిస్తారో? ఓ సారి తెలుసుకుందాం. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని అధికారులు అత్యధికంగా ఖర్చు చేసే వినియోగదారులకు పన్నులను తగ్గించే ప్రతిపాదనలను అన్వేషిస్తున్నారు. కొత్త ఆదాయపు పన్ను విధానంలో ప్రస్తుతం 5 శాతం నుంచి 20 శాతం వరకు పన్ను విధిస్తున్నారు. అందువల్ల సంవత్సరానికి రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షల మధ్య సంపాదిస్తున్న వేతన పన్ను చెల్లింపుదారులు ఈ మార్పుల నుండి ప్రయోజనం పొందవచ్చు. అలాగే ఈ తాజా బడ్జెట్‌లో కొత్త పన్ను స్లాబ్‌ను ప్రవేశపెట్టే అవకాశం కూడా ఉంది. అదనంగా కొత్త పన్ను విధానంలో మినహాయింపు పరిమితి రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకూ పెరగవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. పాత ఆదాయపు పన్ను విధానంలో పన్ను శ్లాబ్‌లను స్ట్రీమ్‌లైన్ చేసే అవకాశాలు ఉన్నాయని వివరిస్తున్నారు. అయితే ఇప్పటికే ఈ నిర్ణయాలు జరిగిపోయేయని పీఎంఓ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తిలో 5.1 శాతం ద్రవ్య లోటు లక్ష్యాన్ని కొనసాగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రూ. 50,000 కోట్ల చర్యల్లో దాదాపు సగం పన్ను తగ్గింపుల నుంచి వస్తాయి. అలాగే చిన్న రైతులకు పీఎం కిసాన్ నగదు చెల్లింపును రూ.6,000 నుంచి రూ.8,000కు పెంచుతుందని అంచనా వేస్తున్నార. కనీస ఉపాధి హామీ కార్యక్రమం కింద చెల్లింపులు పెంచడం, మహిళా రైతులకు ఆర్థిక సహాయాన్ని విస్తృతం చేయడం వంటి అంశాలు చర్చల్లో ఉన్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుతం ఆర్థికవేత్తలు, ట్రేడ్ యూనియన్లు, పరిశ్రమల ఛాంబర్‌లతో సహా వాటాదారులతో ప్రీ-బడ్జెట్ సంప్రదింపులు జరుపుతున్నారు. పూర్తి బడ్జెట్‌ను జూలై 22న ప్రకటించే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి.

# టర్న్ దాఖలకు ముంచుకొస్తున్న గడువు.. ఆ లోపు చేయకపోతే పరిస్థితి ఏంటి?




పన్ను చెల్లింపుదారులు ఈ ఏడాది జూలై 31లోపు ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్)ని దాఖలు చేయాలి. అలా చేయని పక్షంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. పెనాల్టీలు విధించే అవకాశం ఉంటుంది. చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంటుంది. అయితే అనుకోని పరిస్థితుల కారణంగా ఐటీఆర్ ఫైలింగ్ డెడ్ లైన్ ను మిస్ అయినా కూడా మరో అవకాశం ఇన్ కమ్ ట్యాక్స్ డిపార్ట్ మెంట్ పన్ను చెల్లింపుదారులకు అందిస్తుంది. ఈ కథనంలో మీరు ఐటీఆర్ ను గడువు లోపు ఫైల్ చేయకపోవడం వల్ల కలిగే చిక్కులను తెలియజేయడంతో పాటు ఆ పరిస్థితిని ఎలా సమర్థంగా నావిగేట్ చేయాలో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

ఐటీఆర్ గడువు మిస్ అయితే..

పన్ను చెల్లింపుదారులు ఎవరైనా ఐటీఆర్ గడువును మిస్ అయితే కొన్ని పర్యావరసనాలు ఫేస్ చేయాల్సి ఉంటుంది. అవేంటంటే..

పెనాల్టీలు: ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 234ఎఫ్ ప్రకారం, గడువు తేదీ తర్వాత డిసెంబర్ 31, 2025లోపుగా మీ ఐటీఆర్ ని ఫైల్ చేస్తే రూ. 5,000 వరకు జరిమానా విధిస్తారు. అదే మీరు డిసెంబర్ 31 తర్వాత ఫైల్ చేస్తే, జరిమానా రూ. 10,000 వరకు పెరుగుతుంది. అయితే, మీ మొత్తం ఆదాయం రూ. 5 లక్షల వరకు ఉంటే, గరిష్ట జరిమానా రూ. 1,000కి పరిమితం అవుతుంది.

చెల్లించాల్సిన పన్నుపై వడ్డీ: మీకు ఏవైనా పన్ను బకాయిలు ఉంటే, మీ రిటర్న్‌ను దాఖలు చేయడంలో ఆలస్యమైనందుకు సెక్షన్ 234ఏ కింద వడ్డీ విధిస్తారు. ఈ వడ్డీని గడువు తేదీ నుంచి దాఖలు చేసిన తేదీ వరకు చెల్లించని పన్ను మొత్తంపై నెలకు ఒక శాతం లేదా నెలలో కొంత భాగానికి లెక్కిస్తారు.

రీఫండ్‌లపై వడ్డీ ఉండదు: రీఫండ్ ఆశించే పన్ను చెల్లింపుదారులు ఆలస్యమైన కాలానికి వడ్డీని కోల్పోవచ్చు. రిటర్న్‌ను ఫైల్ చేసిన తేదీ నుంచి వాపసులపై వడ్డీ పెరగడం ప్రారంభమవుతుంది. కాబట్టి ఆలస్యంగా ఐటీఆర్ దాఖలు చేస్తే వడ్డీ పెరగడం వల్ల రీఫండ్ ఏమి రాకపోవచ్చు.

నష్టాలను క్యారీ ఫార్వర్డ్ చేయడం కుదరదు: ఎవరైనా గడువును మీరితే.. వారు ఇంటి ఆస్తిని మినహాయించి వివిధ ఆదాయాల కింద నష్టాలను క్యారీ ఫార్వర్డ్ చేయలేరు. ఇది వ్యాపారాలు పెట్టుబడిదారులకు గణనీయమైన ఆర్థిక ప్రతికూలతగా మారుతుంది.

దిద్దుబాటులు, పునర్విమర్శలకు సమయం ఉండదు: ఆలస్యంగా దాఖలు చేయడం వల్ల లోపాలను సరిదిద్దడానికి లేదా రిటర్న్‌ను సవరించడానికి అందుబాటులో ఉన్న సమయం తగ్గిపోతుంది. ఐటీఆర్ ను సవరించడానికి గడువు సాధారణంగా అసెస్‌మెంట్ సంవత్సరంతో ముగుస్తుంది. ఆలస్యంగా ఫైల్ చేయడం వల్ల ఈ టైమ్‌లైన్‌ను తగ్గిపోతోంది.

గడువు దాటితే ఇలా చేయాలి..

ఆలస్యంగా రిటర్న్ దాఖలు.. ఎవరైనా జూలై 31 గడువును దాటిపపోతే, వారు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139(4) ప్రకారం ఆలస్యంగా రిటర్న్‌ను ఫైల్ చేయవచ్చు. ఆలస్యమైన రిటర్న్‌ను డిసెంబర్ 31, 2025 లోపు ఫైల్ చేసే అవకాశం ఉంది. ఇది పన్ను చెల్లింపుదారులు తమ పన్ను బాధ్యతలను నెరవేర్చడానికి అనుమతిస్తుంది. అయితే దీనికి పెనాల్టీలు, వడ్డీ ఛార్జీలు ఉంటాయి.

ఐటీఆర్-యూ (అప్‌డేటెడ్ రిటర్న్).. ఫైనాన్స్ యాక్ట్ 2022లో భాగంగా ప్రవేశపెట్టబడిన ఐటీఆర్-యూ పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లను సంబంధిత అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన రెండు సంవత్సరాలలోపు అప్‌డేట్ చేయడానికి అనుమతిస్తుంది. ఈ సదుపాయం పన్ను చెల్లింపుదారులకు వారి అసలు లేదా ఆలస్యమైన రాబడిలో లోపాలను లేదా లోపాలను సరిదిద్దడంలో సహాయపడటానికి రూపొందించారు. అయితే, అప్‌డేట్ చేసిన రిటర్న్‌ను ఫైల్ చేయడం వల్ల అదనపు పన్ను ఉంటుంది. ఇది మొదటి సంవత్సరంలో ఫైల్ చేస్తే పన్ను, వడ్డీలో 25 శాతం, రెండవ సంవత్సరంలో ఫైల్ చేస్తే 50 శాతం ఉంటుంది.

# ఐటీ నిపుణులకు గుడ్ న్యూస్.. ఆ బ్యాంకులో భారీగా నియమకాలు




బ్యాంకింగ్ వ్యవస్థ మన దేశంలో కొత్త పుంతలు తొక్కుతోంది. అన్ని బ్యాంకులు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయి. ఏ బ్యాంకుకు ఆ బ్యాంకు ప్రత్యేకమైన యాప్ లను తీసుకొస్తున్నాయి. వాటిని మెయింటేన్ చేసేందుకు స్టాఫ్ కూడా అవసరం అవుతున్నారు. ముఖ్యంగా టెక్ టీం ప్రతి బ్యాంకులకు అవసరం అవుతోంది. ఈ క్రమంలో అన్ని బ్యాంకులు తమకు ఉన్న రెగ్యూలర్ ఉద్యోగులతో పాటు టెక్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారిని కూడా రిక్రూట్ చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా రాబోయే రెండేళ్లలో తన అంతర్గత సాంకేతిక బృందం హెడ్‌కౌంట్‌ను 3,000కి రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ బ్యాంకులో పనిచేసే ఒక ఉన్నత అధికారి సూచన ప్రాయంగా చెప్పారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలు..

ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టెక్నాలజీ ఆర్కిటెక్చర్‌లో లోటుపాట్ల గుర్తించి.. బ్యాంకులపై కఠినమైన చర్యలు తీసుకుంది. ఆ లోపాల వల్ల లావాదేవీల క్రమం తప్పడంతో వినియోగదారులు ఇబ్బందులు పడటంతో లావాదేవీలు ఎక్కువగా చేయగల సామర్థ్యాన్ని పెంచేలా కొన్ని ప్రత్యేకమైన చర్యలు తీసుకుంది.

రెట్టింపు ఉద్యోగాలు..

బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ)లో ప్రస్తుతం 1,500 మంది ఉద్యోగులున్నారని.. ఈ టీమ్ స్ట్రెంత్‌ను మరింతగా పెంచనున్నట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేబదత్తా చంద్ ఇటీవల ఓ వార్తా సంస్థతో చెప్పారు. అందుకోసం రెగ్యులర్ హైరింగ్ ప్రక్రియతో స్పెషలిస్ట్ ఉద్యోగాలకు త్వరలో నియామకాలు జరుగుతాయని వివరించారు. రాబోయే రెండేళ్లలో తమ ఐటీ టీమ్‌లోని వ్యక్తుల సంఖ్యను రెట్టింపు చేస్తామని మార్చి త్రైమాసిక ఆదాయాలను ప్రకటించిన తర్వాత చంద్ చెప్పారు. 1,500 మంది అంతర్గత సిబ్బందితో పాటు, ఐటీ ఫంక్షనింగ్ విభాగంలో నిమగ్నమై ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ఉన్నారని చంద్ చెప్పారు. ఐటీ నిపుణుల బలాన్ని గణనీయంగా పెంచుకునే ప్రయత్నాల్లో భాగంగా సమకాలీన ప్రతిభావంతులను నియమించుకోవాలని బ్యాంక్ కోరుకుంటోందని ఆయన చెప్పారు.

త్వరలో బీఓబీ నుంచ మరిన్ని ఫీచర్లు..

ఉత్పాదక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్లాట్‌ఫారమ్ త్వరలో వినియోగదారుల కోసం ప్రత్యక్ష ప్రసారం కానుందని, ఇందులో ఇంటరాక్టివ్ మార్గంలో అనేక సేవలను పొందవచ్చని చంద్ అన్నారు. కేవలం మౌలిక సదుపాయాలపైనే దాదాపు రూ. 2,000 కోట్ల పెట్టుబడులతో సహా సాంకేతిక రంగంపై బ్యాంక్ దూకుడుగా ఖర్చు చేస్తోందని చంద్ చెప్పారు.

బీఓబీ ఐటీ వ్యయం ఇది..

2024 ఆర్థిక సంవత్సరంలో, బ్యాంక్ టెక్నాలజీపై రూ.743 కోట్ల బడ్జెట్‌ను కలిగి ఉంది. మేనేజ్‌మెంట్ వ్యాఖ్యానం ప్రకారం ఐటీ వ్యయం రూ.453 కోట్లుగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 60 కొత్త శాఖలను ప్రారంభించాలని బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుంది. 2025 ఆర్థిక సంవత్సరంలో, బ్యాంక్ 12-14 శాతం క్రెడిట్ వృద్ధిని లక్ష్యంగా చేసుకుంటుంది. 10-12 శాతం డిపాజిట్ వృద్ధితో బ్యాకప్ చేస్తుంది.




# పవన్ కల్యాణ్ గారికి మాట రాకూడదనే వివరణ ఇస్తున్నాను: జానీ మాస్టర్



జానీ మాస్టర్ తనపై సతీష్ అనే డాన్సర్ చేసిన ఆరోపణలకు ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చాడు. కేవలం పవన్ కళ్యాణ్ మాట రాకూడదు అనే ఉద్దేశ్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టుగా చెప్పాడు. సతీష్ ఆరోపణలను తిప్పికొట్టడమే కాకుండా, సతీష్ అనే అతను అసోసియేషన్ లో ఎంతటి దురుసుగా ప్రవర్తించాడో కూడా చెప్పాడు జానీ మాస్టర్. సతీష్ ఆరోపణలు నిజమని రుజువైతే తాను కోరియోగ్రఫీ వదులుకుంటాను అని కూడా చెప్పాడు జానీ మాస్టర్. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పై డాన్సర్ సతీష్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. తనకి పని లేకుండా చెయ్యడానికి జానీ మాస్టర్ కొరియోగ్రాఫర్స్ అందరికీ చెపుతున్నాడని, తనకి పని లేకుండా పోయిందని, తనకి జీవనం లేకుండా చెయ్యడానికి జానీ మాస్టర్ ప్రయత్నం చేస్తున్నాడని ఇలా ఆరోపణలు చేసాడు సతీష్. అలాగే జానీ మాస్టర్ పై సతీష్ రాయ్ దుర్గం పోలీసు స్టేషన్ లో కంప్లైంట్ కూడా ఇచ్చాడు, కానీ ఎఫ్ఐఆర్ రాయలేదు,ఎందుకంటే ఇద్దరూ మళ్ళీ కాంప్రమైజ్ అయ్యారు. అయితే ఈరోజు జానీ మాస్టర్ తనపై వచ్చిన ఆరోపణలకు ఒక మీడియా సమావేశం పెట్టి వివరణ ఇచ్చాడు. జానీ మాస్టర్ తెలుగు టీవీ డాన్సర్స్, డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ కి అధ్యక్షుడిగా వున్నాడు. ఇప్పుడు ఆ హోదాలోనే ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్టుగా చెపుతూ, ఆ హోదాలో మాట్లాడుతున్నాను అని చెప్పాడు. డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ కొంత భూమిని కొన్నామని, దానికి చాలా ఇబ్బందులు ఎదురయ్యాయని, ఆ ఇబ్బందులను అధిగమించి, ఒక పరిష్కారం రావాలనే వుద్దేశంతో తనకి ప్రెసిడెంట్ పదవి ఇచ్చారని చెప్పాడు జాన్ మాస్టర్. అలాగే యూనియన్ హెల్త్ ఇన్సూరెన్స్ కోసం రామ్ చరణ్, ఉపాసన లతో మాట్లాడామని, అది ఇప్పుడు ప్రాసెస్ లో ఉంది అని చెప్పాడు జానీ మాస్టర్. యూనియన్ లో మాట్లాడిన విషయాలను ఎప్పుడూ ఇంటర్నల్ గా ఉంచాలి గానీ, బయటకి చెప్పకూడదు అని ఒక నియమం వుంది. కానీ సతీష్ అనే అతను తన స్టేటస్ గా పెట్టడం జరిగింది. అప్పుడు ఆలా చెయ్యకూడదు, అది తీసెయ్యమని అతన్ని అడిగాము. దానికి అతను చాలా దుర్భాషలాడారని చెప్పారు జానీ. అదే విషయం యూనియన్ లో చర్చిస్తే సతీష్ తన తప్పుని ఒప్పుకోవటం కూడా జరిగిందని చెప్పాడు జానీ మాస్టర్. అప్పుడు యూనియన్ నిబంధనల ప్రకారం సతీష్ కి జరిమానా విధించటం జరిగింది. అంతకముందు సతీష్ కమిటీలో వున్నాడు, ఎవరు తప్పు చేసిన జరిమానా కట్టాలని వాదించాడు. అలా వాదించిన సతీష్ ఇప్పుడు తానేంటో చూపిస్తా అని బెదిరించాడు. తానొక నక్సలైట్ నని, తుపాకీ ఉందని సతీష్ బెదిరింపులు చేశాడు. యూనియన్ నిబంధనలు ఫాలో అవ్వమని సతీష్ కి చెపితే, అవి తప్ప ఏవేవో చేస్తున్నాడు. ఇప్పుడు నేను ఇలా మీడియా ముందుకు నాపైన వచ్చిన ఆరోపణలకి సమాధానం ఎందుకు ఇస్తున్నాను అంటే, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారికి ఇబ్బంది కాకూడదు అని. ఎందుకంటే నేను అతని పార్టీకి సపోర్ట్ గా ఉన్నాను కాబట్టి, ఇప్పుడు ఈ వివరణ ఇస్తున్నాను అని చెప్పాడు జానీ మాస్టర్. నాపై సతీష్ చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే, నేను నా పదవికి రాజీనామా చేస్తాను, అలాగే కొరియోగ్రాఫీ కూడా వదిలేస్తాను అని చెప్పాడు జానీ. తను మొదటి నుండీ డాన్సర్స్ కు అన్నీ విధాలుగా సపోర్ట్ గా ఉండే వ్యక్తినని, కొరియోగ్రాఫర్ కమీషన్ కూడా నేను తీసుకోకుండా అసోసియేషన్ కే ఇస్తున్నాను అని చెప్పాడు. అలాగే 'పుష్ప 2', 'డబుల్ ఇస్మార్ట్' సినిమాల కొరియోగ్రఫీ చేసేటప్పుడు మన డాన్సర్స్ కే ఎక్కువ అవకాశాలకు ఇవ్వటం జరిగింది అని చెప్పాడు. సతీష్ వర్క్ మేము ఎవరమూ ఆపలేదు, పైగా అతను పెమెంట్ తాను అసోసియేషన్ నుంచి కాకుండా తన పర్సనల్ ఎకౌంట్ లో వేయించుకున్నాడు. అలాగే అతని మెంబర్ షిప్ కూడా అసోసియేషన్ నుండి తీయలేదు, కానీ అసోసియేషన్ సపోర్ట్ లేకుండా అతను వర్క్ చేసుకోవచ్చని అతనికి చెప్పటం జరిగింది, అందువలన సతీష్ పని లేకుండా లేదు, పని చేసుకుంటున్నాడు. ఇంతకు ముందు రాకేష్ మాస్టర్ ను కూడా గతంలో సతీష్ బాగా ఇబ్బంది పెట్టాడు,

# సినీ పెద్దలూ... అసలు మీరు మారరా! మీలో మార్పు రాదా?



సినిమా పరిశ్రమ అంటే మేమే అన్న రీతిలో ఒంటెద్దు పోకడలతో కొందరు సినీ పెద్దలు గత ప్రభుత్వ హయాంలో చర్చలకు వెళ్ళేటప్పుడు ఎలా ప్రవర్తించారో...ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత కూడా అలానే వ్యవహరిస్తున్నారని సీనియర్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ నట్టి కుమార్ ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. "మళ్ళీ కొందరు ఆ పెద్దలే సీనులోకి వచ్చేసి, ఎవ్వరికీ సమాచారం ఇవ్వకుండా కొత్త ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని కలసి అభినందనలు చెప్పడానికి సోమవారం వెళుతున్నట్లు తెలిసింది. నిజానికి అభినందనలు చెప్పడానికి వారు వెళుతుండటం మహదానందమే. అయితే వారి వరకే వారు గిరిగీచుకోకుండా, ఇతర చిన్న నిర్మాతలను కూడా కలుపుకుని వెళితే బావుండేది. వీళ్ళు ప్రవర్తిస్తున్న పద్ధతులను చూస్తుంటే వాళ్లలో ఇక మార్పు రాదు అనిపిస్తోంది. సినీ పరిశ్రమ మనుగడకు పెద్ద సినిమాలతో పాటు మధ్యతరహా బడ్జెట్, చిన్న బడ్జెట్ సినిమాలు అత్యంత ఆవశ్యకం. తెలుగు సినీ పరిశ్రమలో 80 శాతం చిన్న సినిమాల నిర్మాణమే సాగుతుంటుంది. వీటిని ఆధారం చేసుకుని ఎంతోమంది జీవిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న చిన్న సినిమా అనేక ఆటుపోట్లను ఎదుర్కుంటోంది. నిర్లక్ష్యానికి గురవుతోంది. ఏపీలోని గత ప్రభుత్వం వల్ల చిత్ర పరిశ్రమకు ఒరిగిందేమీ లేదు. అప్పట్లో కూడా ప్రభుత్వం చర్చలకు పిలిచినపుడు ఎవరైతే సినీ పెద్దలు వెళ్లారో.... ఇప్పుడొచ్చిన కొత్త ప్రభుత్వం వద్దకు కూడా ఆ పెద్దలే తిరిగి వెళుతున్నారు. కొత్త ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని కలిసి అభినందనలు చెప్పడానికి వారు వెళుతుండటం మహదానందమే. కానీ విభజించు పాలించు రీతిలో కాకుండా తెలుగు ఫిలిం ఛాంబర్, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ తరపున అఫిషియల్‌గా అనౌన్స్ చేసి.. చిన్న, మధ్య తరహా బడ్జెట్ నిర్మాతలను కలుపుకుని వెళితే చాలా బావుండేది. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా సినిమా పరిశ్రమ అంటే మేమే అన్న రీతిలో ఒంటెద్దు పోకడలతో ఎలా ప్రవర్తించారో ఇప్పుడు ప్రభుత్వం మారగానే మళ్ళీ సీనులోకి వచ్చేసి, ఎవ్వరికీ సమాచారం ఇవ్వకుండా కొంతమంది పెద్దలు వారికి వారే వెళ్లడానికి పూనుకోవడం ఎంతమాత్రం కరెక్ట్ కాదు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీశాఖా మంత్రి నారా లోకేష్ వీరి కపట నాటకాన్ని గ్రహించాలి. గత సీఎం జగన్‌కు, నాటి ప్రభుత్వానికి భయపడి, ఏ రోజు అన్యాయాన్ని వీరు ఎదిరించి ఎరుగరు. పరిశ్రమ మేలు కోసం నిలదీసిన దాఖలాలు అసలే లేవు. అరాచక ప్రభుత్వం పోవాలి. కూటమి ప్రభుత్వం రావాలని కనీసం సపోర్ట్ చేయలేకపోయిన వీళ్లంతా మళ్ళీ మేమే సినిమా పరిశ్రమ అంటూ విభజించి పాలిస్తున్నారు. 2014లో చంద్రబాబు నాయుడుగారిని కూడా తప్పుదోవ పట్టించి హైదరాబాద్ ఫిలిం నగర్ కల్చరల్ క్లబ్ వేరు, విశాఖపట్నం ఫిలిం కల్చరల్ క్లబ్ వేరు అంటూ కె.ఎస్.రామారావు డబ్బులు సైతం వసూలు చేశారు. ఈ విషయాలను ఏపీ ప్రభుత్వ పెద్దలు అర్థం చేసుకుని ఎవరికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వాలో ఆలోచించాలని కోరుతున్నాను. సినీ పరిశ్రమలోని పెద్ద, చిన్న సినిమా సమస్యలను అందరినీ కలుపుకుని పరిష్కరిస్తారని ఆశిస్తున్నాను" అని నట్టి కుమార్ స్పష్టం చేశారు.

# ఆ సంబంధం మోజులో ప్రియుడితో కలిసి తప్పుచేసింది.. ఇప్పుడు ఒంటరిగా ఉంటూ కుమిలి కుమిలి ఏడుస్తున్న నటి..



బెంగళూరు రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన నటుడు దర్శన్‌కు పరప్పన అగ్రహార జైలులో ప్రత్యేక బ్యారక్‌ను కేటాయించారు. దర్శన్‌తో పాటు మరో నటుడు ప్రదోశ్‌కు అటాచ్డ్ బాత్ రూమ్‌తో కూడిన ప్రత్యేక బ్యారక్ ఇచ్చారు. రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌కు 6106 నంబరును కేటాయించారు జైలు అధికారులు. జైలులో దర్శన్‌తో పాటు.. పవిత్రా గౌడ ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. దర్శన్ అరకొరగా భోజనం చేస్తున్నట్లు.. రాత్రి ఆలస్యంగా నిద్రపోయినట్లు జైలు సిబ్బంది గుర్తించారు. హత్య కేసులో దర్శన్ అరెస్టయి ఇప్పటికే రెండు వారాలు పూర్తయింది. ఆయన బరువు కొంత తగ్గగా, బీపీ కూడా నియంత్రణలో లేదని జైలు అధికారులు చెబుతున్నారు. ఇక మహిళా బ్యారక్‌లో ఉన్న పవిత్రా గౌడ ఇతర ఖైదీలతో కలవకుండా, ఒంటరిగా ఉంటూ ఏడుస్తున్నట్లు జైలు సిబ్బంది గుర్తించారు. హత్య కేసులో నిందితులు మొత్తం 17మందిని పరప్పన అగ్రహార జైలులోనే ఉంచారు. వీరందరికీ 13 రోజుల రిమాండ్ విధించింది కోర్ట్. నిందితులను బెంగళూరుకు బదులుగా తుమకూరు జైలుకు తరలించాలని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేసిన వాదనలకు దర్శన్ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఇవాళ మరోసారి విచారణ జరగనుంది. కన్నడనాట కలకలం రేపిన రేణుకాస్వామి మర్డర్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. భార్యను విస్మరించి.. ప్రేయసితో వివాహేతర సంబంధం పెట్టుకుని.. ఇదేమని ప్రశ్నించిన అభిమానిని టార్గెట్ చేసి హతమార్చారు.. నటుడు దర్శన్.. అతని ప్రియురాలు పవిత్ర గౌడ.. రేణుకాస్వామి మర్డర్‌కు ముందు దర్శన్ పవిత్ర కలిసి షెడ్డుకు వెళ్లారు.. రేణుకాస్వామిని పిలిపించి..అతిదారుణంగా కొట్టి చంపేశారు. రేణుకాస్వామి చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత డెడ్ బాడీని మురికి కాల్వలో పడేశారు. ఏం తెలియనట్టు పవిత్ర, దర్శన్ షూటింగ్‌కి వెళ్లారు. కార్తీక్, కేశవ్, నిఖిల్, రాఘవేంద్రలకు డబ్బులిచ్చి లొంగిపోవాలని చెప్పడంతో వాళ్లు సరెండర్ అయ్యారు. కానీ..వీళ్లల్లో ఎవరికి క్రైమ్ బ్యాక్ గ్రౌండ్ లేకపోవడంతో పోలీసులకు ఎక్కడో తేడా కొట్టింది. తమ స్టైల్లో ఇన్వెస్టిగేషన్ చేయడంతో నిజాలు వెలుగులోకి వచ్చాయిఆ సంబంధం మోజులో ప్రియుడితో కలిసి తప్పుచేసింది.. ఇప్పుడు ఒంటరిగా ఉంటూ కుమిలి కుమిలి ఏడుస్తున్న నటి

# ఆ నటిపైనా అతడు అలాంటి దాడి!



రేణుకాస్వామి నన్ను కూడా అసభ్య మెసెజ్ లో ఇబ్బంది పెట్టాడంటూ మరో కన్నడ నటి చిత్రల్ రంగస్వామి తాజాగా తెరపైకి వచ్చింది. ఇన్ స్టా గ్రామ్ స్టోరీ లో షేర్ చేసిన వీడియో లో ఆమె మాట్లాడుతూ సంచలన ఆరోపణలు చేసింది. ప్రస్తుతం దేని గురించి చర్చ జరుగుతుందో అందరికీ తెలిసిందే. ఆ విషయంలో అంతా బాధగానే ఉన్నారు. రేణుకాస్వామి కుటుంబానికి ఆ భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నా. ఈ కేసు విషయంలో ఎవరికీ సపోర్ట్ చేయడం లేదు. కానీ రేణుకాస్వామి చాలా మంది అమ్మాయిలకు అశ్లీల మెసేజ్ లు పంపింది వాస్తవం. అతడిపై పోలీస్ స్టేషన్ లో కేసు కూడా నమోదైంది. గౌతమ్ అనే పేరుతో నాకు అలాంటి మెసెజ్ లు పంపించాడు. ఆ స్క్రీన్ షాట్లు ఇప్పుడే నేను బయట పెట్టలేను. అందుకే వాటిని పోస్ట్ చేయడం లేదు. దుస్తులు లేకుండా షేర్ చేస్తే నేను బ్లాక్ చేసే దాన్ని. కానీ ఇక్కడ ఆశ్చర్యమేంటి? అంటే నా ఇన్ స్టా గ్రామ్ లో బ్లాక్ చేసిన లిస్ట్ లో ఇంతకు ముందే ఇతడి అకౌంట్ కూడా ఉంది. చాలా రోజులు సైలెంట్ గానే ఉన్నాను. ఇప్పుడు పరిస్థితి చూసే మాట్లాడుతున్నాను అని రాసుకొచ్చింది. చిత్రల్ రంగస్వామి నటి. ఆమె మంచి బాడీ బిల్డర్ కూడా. బిగ్ బాస్ లోనూ పాల్గొంది. మరి తాజాగా చిత్రల్ తెరపైకి తెచ్చిన అంశాల్ని పోలీసులు, కోర్టు ఎంతవరకూ పరిగణలోకి తీసుకుంటుంది అన్నది తెలియాలి. పవిత్ర గౌడ్ ని అసభ్యంగా వేధించడానే ప్రియుడు దర్శన్ రేణుకాస్వామిని హత్య చేసినట్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం దర్శన్, పవిత్ర, మరికొంత మంది అభియోగాల నేపథ్యంలో జ్యూడీడిషయల్ కస్టడీలో ఉన్నారు. ఇక దర్శన్ గురించి తెలిసిన వారంతా ఆయన గురించి సానుకూలంగా స్పందించే వారు మరికొంత మంది అయితే వ్యతిరేకంగా మాట్లాడేవారు మరికొంత మంది. దర్శన్ మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం వల్లే హత్య జరిగి ఉంటుందని మానసిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఎర్రకోక డిజైనర్ బ్లౌజులో కిర్రెక్కిస్తోంది!



పాతికేళ్ల వయసు.. కేవలం ఆరేళ్ల కెరీర్ లో ప్రియాప్రకాష్ వారియర్ సాధించినదేమిటి? అంటే.. నటిగా పరిణతి చెందింది. ఒరు ఆధార్ లవ్ చిత్రంతో మలయాళంలో అడుగుపెట్టిన ఈ బ్యూటీ వింక్ గాళ్ గా పాపులరైన సంగతి తెలిసిందే. ఒకే ఒక్క కన్ను గీటుడు దృశ్యంతో ఈ బ్యూటీ అనంతంగా హృదయాలను కొల్లగొట్టింది. ఇప్పటికీ ఎప్పటికీ తనను వింక్ గాళ్ అని పిలవనిదే .. ఏదీ ముందుకు సాగదు. అయితే ఈ ఆరేళ్ల కెరీర్ లో ప్రియా ఏం నేర్చుకుంది? అంటే నటిగా వృత్తిపరంగా అలాగే వ్యక్తిగతంగా ఉత్తమంగా మారిందని అభిమానులు అంటున్నారు. మునుపటితో పోలిస్తే తనలో పరిణతి ఎంతగానో పెరిగింది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లోను ప్రియా ప్రకాష్ జరంత జోరుగా ఉంది. ఇటీవల బోల్డ్ ఫోటోషూట్లతో యువతరాన్ని ఆకర్షిస్తోంది. గ్లామర్ డాళ్ పాత్రలతో పాటు నటిగా నిరూపించుకునే అవకాశాల కోసం వేచి చూస్తోందట. ప్రియా ప్రకాష్ ఓవైపు పెద్ద తెర అవకాశాలు.. మరోవైపు ఓటీటీ అవకాశాల్ని ప్రియా ఒడిసిపట్టుకుంటోంది. ఇంతకుముందు యువహీరో నితిన్ సరసన అంధాధున్ రీమేక్ లో అవకాశం అందుకున్న ప్రియా ప్రస్తుతం టాలీవుడ్ లో అవకాశాల కోసం వేచి చూస్తోంది. ఇంతలోనే ప్రియా స్టన్నింగ్ క్యాచీ ఫోటోషూట్లు నెట్ ని షేక్ చేస్తున్నాయి. తాజాగా ప్రియా షేర్ చేసిన ఫోటోగ్రాఫ్ ఎంతో ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. డిజైనర్ బ్లౌజ్, రెడ్ శారీలో ప్రియా ఎంతో ట్రెడిషనల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

# బ్రౌన్ డిజైన్ లో కళాకవతి కవ్వింపు!



తాజాగా ఇన్ స్టాలో మరో పిక్ వదిలింది. ఇందులో అమ్మడు ఒళ్లంతా కప్పేసిన డిజైనర్ దుస్తుల్లో తళుక్కున మెరిసింది. బ్రౌన్ రంగు డిజైన్ లో అమ్మడు తనదైన మార్క్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంది. కీర్తి సురేష్ ఆన్ స్క్రీన్ పై గ్లామర్ డోస్ పెంచిన సంగతి తెలిసిందే. పాత్ర పరంగా ఎంతవరకూ నటించాలో? అంతవరకూ పూర్తిగా న్యాయం చేస్తుంది. మునుపటిలా మడికట్టుకుని కూర్చుంటే వచ్చే అవకాశాలు రావని మారిందా? దర్శకుల ఒత్తిడి కారణమా? అన్నది పక్కనబెడితే మార్పు తో కొత్త అవకాశాలు బాగానే అందు కుంటుంది. కొంతవరకూ తనలో ఛేంజోవర్ ప్రొఫెషనల్ గా కలిసొచ్చింది. కానీ ఆఫ్ ది స్క్రీన్ మాత్రం అమ్మడు రూల్స్ ఎక్కడా బ్రేక్ చేయడం లేదు. ఫరిది దాటి గ్లామర్ షో చేస్తు న్నట్లు ఇంతవరకూ ఎక్కడా దొరకలేదు. నెట్టింట షేర్ చేసే ఫోటోల్లో తన కట్టుబాట్లను మాత్రం తూచ తప్పకుండా పాటిస్తూనే ఉంది. అందాలు కనిపించే డ్రెస్ లకంటే డ్రెస్ తోనే అందం తీసుకొచ్చే పాలసీతో ముందుకెళు తుంది. ఆఫ్ ది స్క్రీన్ లో స్కిన్ షో...క్లీవేజ్ షో వంటి వాటికి తొలి నుంచి దూరంగానే ఉంది. ఇప్పటికీ అదే మెయింటెన్ చేస్తోంది. తాజాగా ఇన్ స్టాలో మరో పిక్ వదిలింది. ఇందులో అమ్మడు ఒళ్లంతా కప్పేసిన డిజైనర్ దుస్తుల్లో తళుక్కున మెరిసింది. బ్రౌన్ రంగు డిజైన్ లో అమ్మడు తనదైన మార్క్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంది. అమ్మడి మ్యాకప్, అలంకరణ ప్రతీది మరింత అందంగా తీర్చి దిద్దాయి. ముఖ్యంగా చెవులకు ధరించిన గోలుసుల్ని పోలిన చెవులీలు సంథింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతున్నాయి. కళావతి డ్రెస్ కంటే చెవులీలే హైలైట్ అవుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. సొగసరి అభిమానులు కీర్తి అందాన్ని పొగిడేస్తూ ఎవరి స్టైల్లో వారు కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. కీర్తి కెరీర్ అయిపోయింది అనుకుంటోన్న సమయంలో అమ్మడు ఎలా కంబ్యాక్ అయిందో తెలిసిందే. హీరోయినే అనే ఇమేజ్ ని పక్కనబెట్టి సిస్టర్ పాత్రలకు సిద్ధమై ఉనికిని కాపాడుకుంది. దీంతో మళ్లీ హీరోయిన్ ఛాన్సులు పుంజుకున్నాయి. ప్రస్తుతం కీర్తి సురేష్ ఖాతాలో తెలుగు, హిందీ ప్రాజెక్ట్ లు ఉన్న సంగతి తెలిసిందే.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, జూన్ -24: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ , జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఆర్డీఓ బి.గంగయ్య లతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖని విటల్ నగర్ కు చెందిన మహమ్మద్ రెహాజుద్దిన్ తాను ఎంఏ ఇంగ్లీష్, పిజిడిసిఏ పూర్తి చేసానని, తనకు కలెక్టరేట్ లో లేదా ప్రభుత్వ రంగ కార్యాలయంలో ఏదైనా విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ గాని, రికార్డ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటికి రాస్తూ అవకాశం, అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం మంగపేట్ కు చెందిన దాముక వెంకటమ్మ తన భర్త మరణించినందున తనకు ప్రభుత్వం అందజేసే వితంతువుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, కాల్వ శ్రీరాంపూర్ ఎంపీడీవో కు రాస్తూ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఎం.సురేష్ తండ్రి పేరు రాజయ్య ఇప్పలపల్లి నివాసుడైన కొమురయ్య కు తనకు ఆర్థిక తగాదాలు ఉన్నాయని, కొమురయ్య సర్వే నెంబర్ 786/బి/3/2 లో గల భూమిపై తాను సుల్తానాబాద్ కోర్టులో దావా వేయడం జరిగిందని, ఇట్టి సర్వే నంబర్లలో ఎలాంటి మార్పులు, చేర్పులు, లావేదేవీలు జరగకుండా నిలువరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండంలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక కాబడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు తమకు ఇండ్లను కేటాయించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, వారి దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వివరాలు తెప్పించుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని లబ్ధిదారుల బృందానికి తెలియజేసారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ., సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకుడిని పరామర్శించిన చల్మెడ



వేములవాడ జూన్ 24 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామ మాజీ సర్పంచ్ జంకే విజయ భర్త శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురికాగా విషయం తెలుసుకున్న వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి పరామర్శించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు గడ్డం హనుమాన్లు, మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు పిట్టల వెంకటేష్, అంజి, గంగం మహేష్ తదితరులు ఉన్నారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్



సిరిసిల్ల, జూన్ 24, తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్ తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు 91, ఉపాధి కల్పన శాఖకు 13, డీఆర్డీఓ 3, సిరిసిల్ల మున్సిపల్ 18, వేములవాడ మున్సిపల్ 3, ఎడి సర్వే 6, బి.సి.వెల్ఫేర్ 2, అగ్రికల్చర్ 2, ఎడ్యుకేషన్ 3, ఫారెస్ట్ 2, సివిల్ సప్లై 4, ఇరిగేషన్ 6, డి.ఎం. సివిల్ సప్లై 1, డి.ఎం.హెచ్. ఓ., 1, డి.పి. ఓ. 5, ఎక్సైజ్ 2, ఎస్సీ కార్పొరేషన్ 1, పంచాయితీ రాజ్ 2, 2బి.హెచ్. కే. 2, ఎల్.డి.ఎం.1, సెస్ 8, ఎం.పి.డి. ఓ. ఇల్లంతకుంట 1, వేములవాడ 2, అర్.సి. ఓ. బి.సి. వెల్ఫేర్ 9, అర్.సి. ఓ. సోషల్ వెల్ఫేర్, 2, ఎస్.డి.సి.3, పోలీస్ 8, హాండ్లూమ్స్ %ɞ% టెక్స్టైల్స్ 1 ఆయా శాఖలకు అన్ని కలిపి మొత్తం 202 వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు మరోసారి విన్నపం



హైదరాబాద్ ఢిల్లీ జూన్ 24 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : తెలంగాణలో సుస్థిర పాలన అందిస్తున్నాం. 8 పార్లమెంట్ సీట్లు గెలుచుకున్నాం.రాష్ట్రంలో ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై విశేష కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం యుటిలిటీ చార్జీలు కట్టమని కేంద్రానికి లేఖ రాయడంతో ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిన విషయం మీ అందరికి తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, నేను, గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు కలిసి యుటిలిటీ ఛార్జీలు కడతామని లేఖ ఇవ్వడం జరిగింది. దీంతోపాటు రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను నితిన్ గడ్కరీగారికి వివరిస్తే వారే స్వయంగా యుటిలిటీ చార్జీలు చెల్లిస్తామని చెప్పారు. దీంతో ప్రాజెక్టు ముందుకు కదిలిన విషయం మీ అందరికి తెలిసిందే. ఎన్నికల మూలంగా ఆర్ఆర్ఆర్ మరియు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని 6 లేన్లుగా మార్చే పనులు కాస్త ఆలస్యం అయ్యాయి. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ప్రతీరోజు 60 వేల వాహనాలు ప్రయాణిస్తాయి. జీఎమ్మార్ఆర్ అనే సంస్థ టోల్ రోడ్డు పనులు తీసుకొని 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికి ఇప్పటికి.. వారు వివిధ కారణాలు చూపించి పనులు పూర్తిచేయలేదు. దీనివల్ల ప్రతీరోజు అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు, వికలాంగులుగా మారుతున్నారు. నేను ఎంపీగా ఉన్నప్పుడు రోడ్డుయొక్క పరిస్థితిని వివరిస్తే ప్రమాదాల నివారణకు 17 బ్లాక్ స్పాట్లు గుర్తించి.. వాటి మరమ్మత్తుల కోసం కేంద్రమంత్రివర్యులు శ్రీ నితిన్ గడ్కరీగారు రూ. 375 కోట్ల రూపాయలను మంజూరీ చేసినప్పటికి.. పనులు చేయాల్సిన జీఎమ్మార్ సంస్థ రెండుసార్లు కోర్టుకు పోయి పనులు చేయకపోతే.. మూడోసారి టెండర్ పిలిచి నిన్ననే పనులు ప్రారంభించిన సంగతి మీ అందరికి తెలిసిందే. డిసెంబర్ లోపు టెంపరరీ రిలీఫ్ కోసం పనులు పూర్తి చేస్తాం. ఒక్క బ్లాక్ స్పాట్స్ రిపేర్లు మాత్రమే కాకుండా 6 లేన్ల రోడ్డును నిర్మించాలని అధికారులతో కలిసి నేను స్వయంగా గడ్కరీగారికి వివరించడం జరిగింది. రీజినల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తానని గడ్కరీగారు చెప్పడం జరిగింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెండింగ్ లో ఉన్న 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు మరోసారి విన్నవించడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించారు. వాటికి జాతీయ రహదారుల సంఖ్యను కేటాయించాలని విన్నవించడం జరిగింది. వారు భారతమాల క్రింద మంజూరీ చేస్తామని చెప్పారు. ఉప్పల్ - ఘట్ కేసర్ ఫ్లైఓవర్ పనులు గత 4 సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్న విషయం గడ్కరీ గారి దృష్టికి తీసుకురావడం జరిగింది.



## రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమి

రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను మూసీ రివర్ డెవలప్మెంట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్గా హైదరాబాద్కు బదిలీ చేశారు.

# సౌత్ లో కమలం వికసిస్తోందా



**బెంగళూరు, జూన్ :** బీజేపీని ఉత్తరాది పార్టీ అంటారు. దక్షిణాదిన కూడా విస్తరించాలని బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో చాలా వరకూ ముందడుగు వేసింది. వచ్చే ఎన్నికల నాటికి కొన్ని రాష్ట్రాలను కమ్మేసినా ఆశ్చర్యం లేదన్న ఫలితాలు వచ్చాయి. సీట్ల పరంగా మాత్రమే కాదు.. ఓట్లు పరంగా కూడా. నిలకడగా పెరుగుతున్న బీజేపీ ఓటు బ్యాంక్ దక్షిణాదిలో ఆ పార్టీ పవర్ గా మారుతోంది. గతంతో పోలిస్తే ఈ సారి సీట్లు పెద్దగా పెరగలేదు కానీ.. ఓట్లు మాత్రం ఊహించని విధంగా పెరిగాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చూస్తే మొత్తంమీద బిజెపికి యూపీ, మహారాష్ట్రతో పాటు కొన్ని రాష్ట్రాల్లో ఎదురు దెబ్బ తగిలింది. కేవలం 240 స్థానాలు మాత్రమే తెచ్చుకోగలిగింది. 2014, 2019 ఎన్నికలలో వచ్చిన ఫలితాలను చేరుకోలేకపోయింది. నరేంద్ర మోడీ ఇప్పుడు నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించాల్సి వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి తీవ్రంగా నష్టపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలోనూ దెబ్బతిన్నది. కానీ ఒడిషాలో బిజెపి మున్నెన్నడూ లేని విజయాలు సాధించింది. 21 లోక్‌సభ స్థానాలలో 20 తెచ్చుకోవడమే గాక మొట్టమొదటి సారిగా అక్క ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. ఇక ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ క్రమంగా బలపడుతోంది. సీట్ల వారీగా చూసినప్పుడు బిజెపి ఈ ప్రాంతంలో పెద్ద పురోగతి సాధించినట్టు కనిపించకపోవచ్చు. ఎందుకంటే అయిదు దక్షిణాది రాష్ట్రాలలో కలిపి దానికి 2019లో 29 సీట్లు వస్తే ఇప్పుడు 2024 లోనూ ఆ సంఖ్య పెరిగింది లేదు. కానీ రాష్ట్రాల వారీ పరిస్థితులు, ఓట్ల వాటా బాగా లోతుగా విశ్లేషిస్తే ఓట్ల శాతం గణనీయంగా పెంచుకుంటూ వెళ్తోంది. తెలంగాణలో బిజెపికి 2019లో నాలుగు సీట్లు, 19.45 శాతం ఓట్లు రాగా 2024 ఎన్నికలలో ఆ సంఖ్య రెట్టింపై 8 సీట్లు గెలవగలిగింది. ఓట్ల వాటా కూడా గణనీయంగా 35.19 శాతానికి పెరిగింది. బిఆర్ఎస్ ఓట్ల వాటా దారుణంగా పడిపోవడం బిజెపికే మేలు చేసింది. కర్ణాటకలో బిజెపికి కొంత బలం పోగొట్టుకున్నది. కానీ ఓట్లు కోల్పోలేదు. 2019 ఎన్నికలలో అది 25 సీట్లు 51.38 శాతం ఓట్లు తెచ్చుకుంటే ఇప్పుడు 17 సీట్లకు పరిమితమై 46.09 శాతం ఓట్లు తెచ్చుకోగలిగింది. అయితే జత కలిసిన జేడీఎస్ 5.64 శాతం ఓట్లు తెచ్చుకోవడంతో మొత్తం ఎన్‌డిఎ ఓట్ల శాతం 51.73 అయింది. అంటే బలం నిలబడినట్లే. తమిళనాడులో బీజేపీ ఒక్క సీటు కూడా తెచ్చుకోలేకపోయింది. 2019లో అయిదు సీట్లకు పోటీ చేసిన బిజెపి ఓట్ల శాతం 3.66 శాతం అయితే ఇప్పుడు 11.24 శాతానికి పెరిగింది. పది నియోజక వర్గాలలో బిజెపి రెండవ స్థానంలో వచ్చింది. అంటే కొన్ని సీట్లలో అది ఎఐడిఎంకె ఓట్లను తెచ్చుకోగలిగిందని అర్థమవుతుంది. కేరళలో బిజెపి త్రిసూర్ సీటు గెలిచి మొదటిసారి ఒక లోక్‌సభ స్థానం పొందగలిగింది. 2019లో 12.9 శాతం ఓట్ల శాతం వుంటే ఇప్పుడు 16.67 శాతానికి పెరిగింది. మొత్తం ఎన్‌డిఎ వాటా 19.2 శాతానికి అంటే కేరళలో ఎన్నడూ రానంత అధికంగా పెరిగింది. బిజెపి చాలా బలహీనంగా వున్న ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పొత్తు వల్ల లాభపడింది. 2019లో కేవలం 0.96 శాతం ఓట్లు మాత్రమే తెచ్చుకున్న ఆ పార్టీ ఇప్పుడు మూడు పార్లమెంటు సీట్లు గణనీయమైన ఓట్లను సాధించింది. బీజేపీ కర్ణాటకలో రెండు దశాబ్దాల కిందటే బీజేపీ బలమైన పునాది ఏర్పర్చుకుంది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలలో కూడా నెమ్మదిగా అప్పుడప్పుడూ ఆగుతూనైనా బిజెపి ముందుకు సాగుతున్నది. బీజేపీ రాజకీయాలు చాలా దూరదృష్టితో ఉంటాయి. వచ్చే ఎన్నికల నాటికి హిందీ రాష్ట్రాల్లో దెబ్బతిన్నా సౌత్ లో భారీ విజయాలతో నాలుగోసారి గెలవాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్లాన్ చేసుకుటున్నారు. దక్షిణాదిలో ఆ పార్టీ వ్యూహం అదే? నిరూపిస్తోంది.

# హిందూజా సోదరులకు నాలుగేళ్ల జైలు




**న్యూఢిల్లీ,జూన్ :** హిందూజా కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులకు స్విస్ క్రిమినల్ కోర్టు నాలుగు నుంచి నాలుగున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అదే సమయంలో మానవ అక్రమ రవాణాకు సంబంధించిన మరింత తీవ్రమైన అభియోగాలను కోర్టు తోసిపుచ్చింది.భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త ప్రకాశ్ హిందూజా, ఆయన భార్య, కుమారుడు, కోడలు జెనీవాలోని విలాసవంతమైన లేక్ సైడ్ విల్లాలో పనిచేస్తున్న నిరక్షరాస్యులైన భారతీయులను అక్రమంగా రవాణా చేశారని ఆరోపణలు వచ్చాయి.కార్మికులను దోచుకోవడం, అనధికారిక ఉపాధి కల్పించడంలో నలుగురూ దోషులని కోర్టు పేర్కొంది. తాము ఏం చేస్తున్నామో సిబ్బందికి అర్థమైందనే కారణంతో అక్రమ రవాణా ఆరోపణలను తోసిపుచ్చారు.నలుగురు హిందుజా కుటుంబ సభ్యులు కార్మికుల పాస్ పోర్టులను స్వాధీనం చేసుకున్నారని, వారికి వేతనాలు స్విస్ ఫ్రాంక్ లో కాకుండా రూపాయిలో చెల్లించారని, వారిని విల్లా నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారని, స్విట్జర్లాండ్ లో తక్కువ ధరకు ఎక్కువ గంటలు పని చేయమని బలవంతం చేశారని ఆరోపణలు వచ్చాయి.భారత్ మూలాలున్న ఈ కుటుంబం పిటిషనర్లతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు గత వారం క్రిమినల్ కోర్టులో వెల్లడైంది. దోపిడీ, మానవ అక్రమ రవాణా, స్విస్ కార్మిక చట్టాల ఉల్లంఘన వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల ఆరోపణల నేపథ్యంలో జెనీవా ప్రాసిక్యూటర్లు కేసు నమోదు చేశారు.దశాబ్దాల క్రితం నుంచి హిందూజా కుటుంబం స్విట్జర్లాండ్ లో నివాసం ఏర్పరుచుకొని జీవిస్తోంది. ప్రకాశ్ ఇప్పటికే 2007 లో ఇలాంటి ఆరోపణలపై దోషిగా ఉన్నాడు. అయినప్పటికీ ప్రాసిక్యూటర్లు అతను సరైన పత్రాలు లేకుండా ఇండియా నుంచి వ్యక్తులను తీసుకొని వచ్చి పనిలో పెట్టుకుంటున్నాడని పేర్కొన్నారు.ఈ తీర్పుపై హిందుజా కుటుంబం స్పందిస్తూ.. 'ఈ న్యాయస్థానంలో తీసుకున్న నిర్ణయాలతోగ్భ్రాంతికి గురయ్యాం, నిరాశ చెందాం, వాస్తవానికి మేము పైకోర్టుకు అప్పీల్ దాఖలు చేశాం, స్విస్ చట్టాల ప్రకారం అత్యున్నత న్యాయ నిర్ణేత తుది తీర్పును అమలు చేసే వరకు నిర్దోషి అనే భావన చాలా ముఖ్యం' అని బాధిత కుటుంబం మీడియాకు తెలిపింది.ఈ కేసులో పిటిషనర్లు తమ ఫిర్యాదులను ఉపసంహరించుకున్నారని, తాము ఎలాంటి చర్యలకు పాల్పడలేదని కోర్టుకు చెప్పారని తెలిపింది. న్యాయ ప్రక్రియపై తమ కుటుంబానికి పూర్తి విశ్వాసం ఉందని, నిజా నిజాలు బయటపడతాయన్న నమ్మకం ఉందన్నారు.ప్రకాశ్ హిందూజా, కమల్ హిందుజా, అజయ్ హిందూజా, నమ్రతా హిందుజా తరఫున న్యాయవాదులు యాయెల్ హయత్, రాబర్ట్ అస్సెల్, రొమైన్ జోర్డాన్ వాదనలు వినిపించారు. స్విస్ ప్రాసిక్యూటర్ వైవ్స్ బెర్టోస్సా తెలిపిన వివరాల ప్రకారం.. హిందూజా కుటుంబం తమ పనిమనుషుల్లో ఒకరికి తమ పెంపుడు కుక్క కోసం చేసిన ఖర్చుకంటే తక్కువ డబ్బు చెల్లించింది. భారతీయ ఉద్యోగుల అక్రమ రవాణా, దోపిడీకి సంబంధించి విచారణ సందర్భంగా బెర్టోస్సా ఈ సమాచారాన్ని సమర్పించారు.హిందుజా కుటుంబ చర్యలను తీవ్రంగా విమర్శించిన ప్రాసిక్యూటర్ నిందితులకు ఐదున్నరేళ్ల వరకు జైలు శిక్ష విధించాలని సిఫారసు చేశారు. సిబ్బంది, హిందూజాలు స్వయంగా అందించిన సాక్ష్యాలు, దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాల ఆధారంగా బెర్టోస్సా వాదనలు వినిపించారు.వారు 'తమ సేవకుల కంటే కుక్క కోసం ఎక్కువ ఖర్చు చేశారు' అని ఆయన చెప్పారు. వారం పాటు రోజుకు 18 గంటలు పనిచేసే మహిళకు ఒకానొక సమయంలో 7 స్విస్ ఫ్రాంక్ లు (7.84 డాలర్లు) మాత్రమే చెల్లించారు. 'పెంపుడు జంతువులు' అనే శీర్షికతో ఉన్న బడ్జెట్ డాక్యుమెంట్ ను ఆయన బెంచ్ ముందు ఉంచారు. ఈ కుటుంబం తమ పెంపుడు కుక్క కోసం సంవత్సరానికి 8,584 స్విస్ ఫ్రాంక్ లను ఖర్చు చేసిందని బెర్టోస్సా అన్నారు.పనిలో పెట్టుకునే సందర్భంలో పని గంటలు, సెలవుల గురించి చెప్పలేదు. వారి పాస్ పోర్టులు దగ్గర ఉంచుకోవడం.. భారత్ కరెన్సీ రూపీల్లో వేతనాలు చెల్లిస్తున్నందున వారి వద్ద స్విస్ ఫ్రాంక్ లు లేవని, వారు బయట ఏం ఖర్చు పెట్టుకుంటారని, యజమాని అనుమతి లేకుండా ఇంటి నుంచి బయటకు రాలేరని, వారికి స్వేచ్ఛ లేదని బెర్టోస్సా వాదించారు.

# టిట్ ఫర్ టాట్.. బూమ్ రాంగ్ అవుతుందా

**హైదరాబాద్, జూన్ :** రెండు సార్లు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీలను కేసీఆర్ విలీనం చేసుకున్నాడు.. అయినా కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేకపోయారు కదా...ఆయన పార్టీ ఎమ్మెల్యేలు మాకెందుకు ?" అని ఎన్నికల్లో గెలిచిన తర్వాత మీడియా ఇంటర్వ్యూల్లో తెలంగాణ సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చెప్పారు. అప్పటికీ కాంగ్రెస్ నేతల ఆలోచనలు టిట్ ఫర్ టాట్ అనే దారిలో ఉన్నాయి. అంటే కేసీఆర్ రెండు సార్లు తమ ఎల్పీల్ని విలీనం చేసుకున్నారు కాబట్టి.. తాము కూడా ఈ సారి బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకోవాలని.. ఆ దిశగా రేవంత్ రాజకీయం చేయాలని కోరుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి కేసీఆర్ చేసిన తప్పుల్ని తాను చేయకూడదన్నట్లుగా పరిణితితో మాట్లాడారు. కానీ పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత సీన్ మారిపోయింది. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్ని చేర్చుకునేందుకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్‌కు ఇప్పుడు ఉన్న ముప్పై ఐదు మంది ఎమ్మెల్యేల్లో కనీసం పదిహేను మందికి అసెంబ్లీ ఎన్నికలుక ముందు కండువా కప్పేందుకు సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత .. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని పార్టీలోకి ఆకర్షించారు. అందు కోసం అధికార బలాన్ని ప్రయోగించారు. మనకు అవసరం లేదు కదా ఎందుకు అని.. అని అంటే వారు కాంగ్రెస్ లో ఉంటే.. ఏదో ఒకటి వాగుతూ ఉంటారు.. మన పార్టీలో చేర్చుకుంటే సైలెంట్ గా ఉంటారని సమాధానం చెప్పారని ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓ సారి బహిరంగంగానే చెప్పారు. అంటే.. ప్రతిపక్ష నేతలు విమర్శలు చేయకుండా వారిని నిర్వీర్యం చేయడానికి తమ పార్టీలోకి కేసీఆర్ ఆహ్వానించేవారు. దీని వల్ల ఆయన పార్టీ ఎంత నష్టపోయిందో.. ఎన్నికల ఫలితాలు



నిరూపించాయి. పార్టీలో పెద్ద ఎత్తున గ్రూపులు పెరిగిపోయాయి. నేతలు ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరాటం చేసుకుంటూ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారు. పొటెన్షియల్ లీడర్లు కొంత మందికి టిక్కెట్లు దక్కక కాంగ్రెస్ లో చేరిపోయి విజయం సాధించారు. అంటే కేసీఆర్ చేసిన చేరికల రాజకీయాలు కాంగ్రెస్ పార్టీని ఏ మాత్రం బలహీనం చేయకపోగా..రివర్స్ లో బీఆర్ఎస్‌కే మైనస్ అయ్యాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నేతలు.. బీజేపీ నేతలు ప్రభుత్వం ఎంత కాలం ఉంటుందో తెలియదని కామెంట్స్ చేశారు. కానీ అది మైండ్ గేమే. ఇప్పుడు రేవంత్ సర్కార్ కు వచ్చిన ముప్పేమీ లేదు. బీజేపీ పార్లమెంట్ సీట్లు కాంగ్రెస్ తో సమానంగా గెల్చుకుంది. కేంద్రంలో మిత్రపక్షాల అండతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ .. కాంగ్రెస్ సర్కార్ జోలికి అసలు రాదు. బీఆర్ఎస్‌కు అసలు అలాంటి అవకాశం కూడా లేదు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.